
www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 17 | ఏప్రిల్ | 2025
పేజీలు 8

## నేడు దండి భాస్కర్ తొమ్మిదవ వర్ధంతి



**ప్రజాపక్షం/ఖమ్మం :** సిపిఐ నాయకులు, సీనియర్ జర్నలిస్టు దండి భాస్కర్ తొమ్మిదవ వర్ధంతి సభ గురువారం ఉదయం తొమ్మిది గంటలకు ఎదులాపురంలో జరుగుతుందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. ఖమ్మం రూరల్ మండలంలో సిపిఐ బలోపేతం కోసం కృషి చేసిన దండి భాస్కర్ వర్ధంతి సభకు సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, సిద్ధినేని కర్ణకుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు అజ్మీర రామ్మూర్తి, టియుడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా కార్యదర్శి ఏనుగు వెంకటేశ్వరరావు, జిల్లా సమితి సభ్యులు పుచ్చకాయల కమలాకర్, రంగారావు, పుచ్చకాయల సుధాకర్, ఓరుగంటి శేషగిరి, చెరుకుపల్లి భాస్కర్, పగిళ్ల వీరభద్రం తదితరులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

# సుప్తావస్థలో వైద్య ఆరోగ్యశాఖ..!



-ఫేక్ యాప్‌లో సిబ్బంది హాజరు
-నియంత్రణ లేని అధికార యంత్రాంగం
-ప్రైవేటుపై దృష్టేది

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఉమ్మడి ఖమ్మంజిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ అచేతనవస్థలో ఉంది. అధికార యంత్రాంగం పనిచేస్తున్నట్లు కనిపిస్తున్నా ఫలితాలు మాత్రం శూన్యం. ప్రైవేటు వైద్య దోపిడీని నియంత్రించాల్సిన వైద్య ఆరోగ్యశాఖ దానిపై పట్టేప్పుడో కోల్పోయింది. ఉన్నతాధికారులు, అంతర్గత సిబ్బందిపైన పట్టు కోల్పోతున్నారన్న ప్రచారం జరుగుతుంది. వైద్య ఆరోగ్యశాఖలో హాజరు పట్టికకు సంబంధించి ప్రభుత్వం ఒక యాప్‌ను రూపొందించింది. విధులకు హాజరయ్యేటప్పుడు తిరిగి విధుల

మిగతా 2లో..

# భూ భారతిపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి

-రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రజల్లో చట్టంపై అవగాహన
-రెవెన్యూ అధికారులతో ఇంచార్జ్ కలెక్టర్ సమావేశం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** భూ భారతి కొత్త ఆర్‌వోఆర్ చట్టంపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ డా॥పి. శ్రీజ తెలిపారు. బుధవారం ఇంచార్జ్ కలెక్టర్ శ్రీజ కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి రెవెన్యూ శాఖాధికారులతో భూ భారతి కొత్త ఆర్‌వోఆర్ చట్టంపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ భూమి హక్కుల భద్రతకు, భూ సమస్యల సత్వర పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి కొత్త ఆర్‌వోఆర్ చట్టాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. తహసీల్దార్లు చట్టంపై పూర్తి

మిగతా 2లో..

# ప్రజల హక్కుల రక్షణకే కమ్యూనిస్టులు





-ఆహారం, ఇల్లు, ఉపాధి, విద్య, వైద్యం, పింఛన్ ప్రజల హక్కులు
-శ్రీకాంత్ సంస్మరణ సభలో బివి రాఘవులు

వివరాలు 2లో..

# టీచర్ చేతిలో ఈత బెత్తం కానరాదాయే..!





**ప్రజాపక్షం /కొణిజర్ల :** బడికెళ్లేటప్పుడు మనమే ఈత బెత్తం తీసుకెళ్లి అదే బెత్తంతో టీచర్ చేత దెబ్బలు తిన్న రోజులు గుర్తున్నాయా..? హోం వర్క్ చేయకపోతే ఆ రోజు చేతులు వాచినట్లే లెక్క. ఇక చదువు సంగతి పక్కన పెడితే క్రమ శిక్షణ తప్పితే ఎలా ఉండేదో ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోండి.! పక్కన కూర్చున్న విద్యార్థి పాలీ పెన్నుపై ఆశ పడి దొంగిలిస్తే మాస్టారు గది బయట కూర్చోబెట్టిన

మిగతా 2లో..

- పోలీసులు లాఠీలకు పని చెప్పి ఏళ్లు గడిచిపాయె..
- బెత్తం, లాఠీ పని చేస్తే కోర్టులో భగవద్గీతపై ప్రమాణ దుస్థితేలా..?
- పిల్లలపై మితిమీరుతున్న గారాబంతో పెద్దయ్యాక నేర ప్రవృత్తి
- మనుషుల్లో అంతరించిపోతున్న భయం, భక్తి
- ఫలితంగా సమాజంలో పెరుగుతున్న నేరాల సంఖ్య

# సుప్తావస్థలో వైద్య ఆరోగ్యశాఖ..!

(మొదటిపేజీ తరువాయి)

నుంచి నిష్క్రమించేటప్పుడు కూడా తప్పనిసరిగా బయో మెట్రిక్ పద్ధతిలో తెలియజేయాల్సి ఉంది. కానీ శాఖలో కొందరు ఒక ఫేక్ యాప్‌ను తయారు చేశారని ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ యాప్ ద్వారా 300 నుంచి 400 మంది ఉద్యోగులు ఈ ఫేక్ యాప్ ద్వారా విధులకు హాజరు కాకుండానే హాజరైనట్లు చూపిస్తున్నారన్న ఆరోపణ ఆ శాఖలోనే విస్తృత చర్చకు దారి తీసింది. ఇంటి వద్ద ఉండటం, విధులకు ఆలస్యంగా రావడం జరుగుతుంది. అలా వచ్చిన వారు ఈ ఫేక్ యాప్‌ను వినియోగిస్తున్నట్లు తెలుస్తుంది. ఉమ్మడి జిల్లాలో ఈ ఫేక్ యాప్ ద్వారా హాజరవుతున్న వారిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని, సక్రమంగా విధులకు హాజరవుతున్న ఉద్యోగులు కోరుతున్నారు. ప్రధానమైన శాఖలో విధుల హాజరుకు సంబంధించి ఫేక్ యాప్ సృష్టించిన వారిపైన కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. ప్రభుత్వ వైద్యం ఎండమావేనన్న సంగతి అందరికీ తెలిసిందే. కొంత మంది అంకితభావం కలిగిన వైద్యుల సేవలు ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ, పిహెచ్‌సి, ఏరియా ఆసుపత్రుల్లోనూ ప్రశంసనీయమే అయినా ఎక్కువ మంది వచ్చామా వెళ్లామా అనే రీతిలో వ్యవహరిస్తుండడంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందించే వైద్యంపై ప్రజలు నమ్మకం కోల్పోతున్నారు. ప్రభుత్వ వైద్యం సన్నగిల్లి ప్రైవేటు వైద్యం రాజ్యమేలుతున్న ప్రస్తుత తరుణంలో ప్రైవేటు వైద్య దోపిడీని నియంత్రించాల్సిన వైద్య ఆరోగ్య శాఖ చేతులెత్తేసింది. డిఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో కొందరు ప్రైవేటు ఆసుపత్రులతో నేరుగా సంబంధాలు ఏర్పరచుకుని హవా నడిపిస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఫీజులపై నియంత్రణ లేకపోవడంతో దోపిడీ శృతిమించింది. ఇష్టాను సారంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. వసతుల కల్పన, ల్యాబ్‌ల నిర్వహణ, అర్హత కలిగిన వైద్యుల ఏర్పాటు తదితర విషయాలపై వైద్య ఆరోగ్యశాఖ పట్టిపట్టనట్లుగా వ్యవహరిస్తుంది. కీలకమైన శాఖ సుప్తావస్థలో పనిచేస్తుండటంపై ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం దృష్టి సారించాల్సి ఉంది. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రజల హక్కుల రక్షణకే కమ్యూనిస్టులు



**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రజల హక్కుల రక్షణ కమ్యూనిస్టుల బాధ్యత అని ప్రజల హక్కుల పరిరక్షణ కోసం కమ్యూనిస్టుల పోరాటం కొనసాగుతుందని సిపిఎం పోలీట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు తెలిపారు. ఆహారం, ఇల్లు, ఉపాధి, విద్య, వైద్యం, పింఛన్ ప్రజల హక్కులని అవి ప్రజలకు చెందే వరకు పోరాటాలు కొనసాగించాలని సిపిఎం 24వ జాతీయ మహాసభ నిర్ణయించిందన్నారు. ఇటీవల మరణించిన సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ సంస్మరణ సభ బుధవారం ఖమ్మం త్రీటౌన్ పరిధిలోని బోసుబొమ్మ సెంటర్‌లో జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో బివి రాఘవులు మాట్లాడుతూ హక్కుల సాధనే లక్ష్యంగా జాతీయ మహాసభకు ప్రతినిధిగా హాజరైన శ్రీకాంత్‌కు మహాసభల తీర్మానాల అమలు పోరాటమే సరైన నివాళి అన్నారు. ట్రంప్ నిర్ణయాల ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా ఉందని 125 శాతం సుంకాన్ని పెంచేందుకు సిద్ధమయ్యారన్నారు. స్వేచ్ఛ, వాణిజ్యంపై ట్రంప్ ఆంక్షలు తెస్తున్నారని బివి రాఘవులు తెలిపారు. జాతీయ మహాసభల్లో ఇద్దరు గుండెపోటుకు గురయ్యారని ఒకరు కోలుకోగా శ్రీకాంత్ మరణించడం దురదృష్టకరమన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా మే 20న దేశ వ్యాప్త సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని రాఘవులు తెలిపారు. ఈ సభలో తమ్మినేని మాట్లాడుతూ ప్రజలకు కష్టాలు వస్తే గుర్తుకు వచ్చేది కమ్యూనిస్టులేనన్నారు. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితి సరిగా లేదని మంత్రి పదవి ఇవ్వకపోతే బాగోదంటూ ముఖ్యమంత్రిని హెచ్చరించే పరిస్థితి వచ్చిందని, గీత దాటొద్దని ముఖ్యమంత్రి హెచ్చరిస్తున్నారంటే కొందరు గీత దాటే పరిస్థితి వచ్చిందా అని తమ్మినేని ప్రశ్నించారు. ఈ సభలో రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, నాయకులు ఎస్. వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా బాబు, సిపిఎం నాయకులు పోతినేని సుదర్శన్, రవికుమార్, పెద్ద సంఖ్యలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సభకు ముందు శ్రీకాంత్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# భూ భారతిపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

అవగాహన కలిగి మండల, గ్రామస్థాయి అధికారులకు అవగాహన కల్పించాలన్నారు. తహసీల్దార్లు వారి కార్యాలయ సిబ్బందికి చట్టంపై పూర్తి స్పష్టత వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో చట్టం అమలుకు పైలెట్ ప్రాజెక్టు క్రింద పాలేరు నియోజకవర్గ నేలకొండపల్లి మండలాన్ని ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. రెవెన్యూ సదస్సులు చేపట్టి ప్రజల్లో చట్టంపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణకు షెడ్యూల్ రూపొందిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఎంపిడివో, ఎంపివో, వ్యవసాయ అధికారులు, పంచాయతీ కార్యదర్శులను రెవెన్యూ సదస్సులో భాగస్వామ్యం చేయాలన్నారు. సదస్సులకు కనీసం 500లకు పైగా జన సమీకరణ చేయాలని ఫంక్షన్ హాల్, త్రాగునీరు, పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి వచ్చిన రైతులకు కొత్త చట్టానికి సంబంధించి కరపత్రాలు ఇవ్వడం వారి సందేహాలను నివృత్తి చేయడం చేయాలన్నారు. సందేహాల నమోదుకు రిజిస్టర్ నిర్వహించాలన్నారు. వాతావరణ పరిస్థితులను గమనిస్తూ ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తకుండా తహసీల్దార్లు చర్యలు చేపట్టాలన్నారు. తహసీల్దార్లు వారి పరిధిలోని కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తూ సమస్యలుంటే వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. మొక్కజొన్న కొనుగోళ్లలో సమస్యలుంటే మార్క్‌ఫెడ్ అధికారులతో సమన్వయం చేసుకుని తగు చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కొత్త చట్టం కొత్త రూల్స్‌పై అధికారులు పూర్తి అవగాహన పొందాలన్నారు. చట్టాన్ని ఒకటికి రెండుసార్లు చదివి అవగతం చేసుకోవాలన్నారు. గురువారం నుంచి రెవెన్యూ సదస్సులను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. వ్యవసాయ , వ్యవసాయేతర భూముల సమర్థవంత నిర్వహణ చేయాలన్నారు. 2020లో ఉన్న రికార్డుల తప్పొప్పులను సరి చేయడానికి ఫిర్యాదుదారు ఒక ఏడాది లోపు దరఖాస్తు చేయాలని ఈ దిశగా అవగాహన కల్పించాలన్నారు. చట్టంలో 11 మాడ్యూల్స్ ఇచ్చారని ఒక్కో మాడ్యూల్‌లో రెండు నుంచి మూడు మాడ్యూల్స్ ఉన్నాయన్నారు. ప్రతి మాడ్యూల్‌ను క్లిస్టర్ క్లియర్‌గా అర్థం చేసుకుని అమలు చేయాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారిణి పద్మశ్రీ, ఎస్‌డిఎం రాజేశ్వరి, ఆర్డీవోలు జి. నర్సింహారావు, రాజేంద్ర గౌడ్, కలెక్టరేట్ ఏవో అరుణ, తహసీల్దార్లు, కలెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి భద్రత చెక్కు అందజేత



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ఖమ్మం ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఎస్సై ఎండి. సౌకత్ అలీ ఇటీవల మరణించారు. ఆయన కుటుంబ సభ్యులకు భద్రతా ఎక్స్‌గ్రేషియా చెక్కు రూ.800000/ను పోలీసు కమిషనర్ సునీల్‌దత్ బుధవారం అందజేశారు. స్థానిక కార్యలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన బాధిత కుటుంబానికి చెక్కు అందించి మాట్లాడారు. బాధిత కుటుంబానికి పోలీసుశాఖ అండగా ఉంటుందన్నారు. శాఖపరంగా ఎటువంటి సహాయసహకారాలు అవసరమైనా పోలీసు అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. పోలీసు కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ చంద్రకళ, సిబ్బంది పాల్గొన్నారు.

# టీచర్ చేతిలో ఈత బెత్తం కానరాదాయే..!

(మొదటిపేజీ తరువాయి)

ఫీలింగ్ ఎలా ఉంటుంది.? నోట్ పుస్తకం కోసం స్నేహితుడితో గొడవ పడితే ఇద్దరినీ గోడ కుర్చీ వేయించిన సందర్భం గుర్తుందా..? ఇలా ఎన్నో అనుభవాలు మన చిన్నతనంలో చవిచూశాం. టీచర్ చేతిలో ఈత బెత్తం మనకు నేర్పిన పాఠాలెన్నో కదా..!! ఒక్కసారి చేసిన తప్పుని మళ్లీ చేయడానికి భయపడ్డామంటే అది కేవలం ఈత బెత్తం మన గుండెల్లో పుట్టించిన వణుకే. ఒక్కమాటలో చెప్పాలంటే రేపటి పౌరుల నడవడికను నాటి తరగతి గదిలో ఈత బెత్తమే నిర్ణయించిందంటే అతిశయోక్తి కానేకాదు.చిన్న దొంగతనం చేసి పోలీసుల చేతికి చిక్కితే ఎలా ఉండేది.? వీపుపై కొత్త లాఠీ విరిగితే ఆ ఘోరాతి ఘోరమైన అవమానం ఎలా ఉంటుందో ఆలోచించుకుంటేనే వెన్నులో వణుకు పుడుతుంది. ఇరుగు పొరుగు వారితో ఏదో కారణం చేత గొడవపడి పోలీస్ స్టేషన్ మెట్లెక్కిన సందర్భం మరోసారి ఆ పని చేయకూడదన్న అనుభవాన్ని నేర్పిస్తుంది. ఇక హత్యలు, మాన భంగాలు చేసిన వారికి పోలీసులు ఇచ్చే ట్రీట్‌మెంట్ ఎలా ఉంటుందో చెప్పనక్కర్లేదు. థర్డ్ డిగ్రీ ప్రయోగించి నిందితుల శరీరంపై ప్రయోగం చేయడం పోలీసులకు అలవాటుగా మారేది. అలాగే పెద్ద ఎత్తున శాంతి భద్రతలకు విఘాతం కలిగించే రాజకీయ గొడవల్లో పోలీసుల చేతికి చిక్కితే ఇక సాధారణ స్థితికి చేరుకుని నడవాలంటేనే నెల సమయం పడుతుంది. లా అండ్ ఆర్డర్‌ను కాపాడేందుకు పోలీసులకు ఇచ్చిన అధికారం నిందితుడు మరోసారి తప్పు చేయకుండా నివారించేది. సీన్ కట్ చేస్తే.. గతమెంతో ఘనం అన్నట్లు పరిస్థితులు మారాయి. టీచర్ల చేతిలో ఈత బెత్తాలు కనిపిస్తే ఒట్టు. విద్యార్థి ఏదైనా తప్పు చేస్తే టీచర్ పొరపాటున కోప్పడినా ఆ మరుసటి రోజే ఆ విద్యార్థి తండ్రి ఫోన్ నెంబర్ ఆ టీచర్ సెల్‌లో మారుమోగుతుంది. ఫలితంగా అటు ప్రభుత్వ పాఠశాలలతో పాటు ఇటు ప్రైవేటు స్కూళ్లలోనూ బెత్తాలు వాడే సంస్కృతినే టీచర్లు మర్చిపోయారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఓ ఉపాధ్యాయుడు ప్రేయర్ సమయంలో విద్యార్థులతో చేసిన సంభాషణ రెండు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారింది. ‘‘అరేయ్ మీరు ఎన్నటికీ మారరురా.. అందుకే ఇక నేనే మారుతున్నా.. ఎంత కొట్టినా, తిట్టినా మీ ప్రవర్తనలో మార్పు రావడం లేదు.. అందుకని నాకు నేనే లెంపలేసుకుని పశ్చాత్తాపం వ్యక్తం చేస్తున్నా.. ఓ తల్లిదండ్రులారా.. మీ పిల్లల్ని అదుపులో పెట్టుకునే బాధ్యత ఇకమీదట మీరే తీసుకోండి.. మీ కాళ్లకు నమస్కారం పెడుతున్నా.. ఇక మీ జోలికి రాను..’’ అంటూ ఆ ఉపాధ్యాయుడు పిల్లలను వేడుకోవడం అందరి మనసులను కలిచివేసింది. అంటే ఉపాధ్యాయ వృత్తి ప్రస్తుత పరిస్థితుల్లో కత్తిమీద సాములా మారిన తీరుకు ఈ ఉదంతమే అద్దం పడుతుంది. తరగతి గదిలో బెత్తం ఝుళిపించడం మానేసిన క్షణం నుంచే సమాజంలో అరాచక వాదం వేళ్లూనుకుంది. చిన్నప్పుడు తల్లిదండ్రులు చేసిన గారాబం ఫలితంగానే పెద్దయ్యాక వారిలో నేర ప్రవృత్తికి బీజాలు పడ్డాయి. మా వాడు హోం వర్క్ చేయకపోయినా, క్రమ శిక్షణ తప్పినా మీరు సహజంగా ఎలా స్పందిస్తారో అలాగే స్పందించండని చెప్పే తల్లిదండ్రులు లేని కారణంగానే సమాజం అదుపు తప్పింది. తరగతి గదిలో ఈత బెత్తం కానరాని తీరానికి చేరుకుంది. అలాగే శాంతి భద్రతలను అదుపులో పెట్టాల్సిన పోలీస్ లాఠీకి కూడా ఇప్పుడు పని కరువైంది. పోలీసులు వారి స్వభావసిద్ధమైన మనస్థత్వంతో నిందితులపై లాఠీ ఝుళిపించి ఏళ్లు గడిచిపోయింది. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం నేర ప్రవృత్తి కలిగిన వారిలో భయాన్ని పూర్తిగా పోగొట్టింది. బాధితులతో మర్యాదగా వ్యవహరించి సమస్యలను పరిష్కరించాల్సిన పోలీసులు నిందితులతో కూడా ఫ్రెండ్లీగా ఉంటున్న ఫలితం లా అండ్ ఆర్డర్‌కు ముప్పు తెచ్చిపెడుతోంది. నేరం చేసి దొరికిన నిందితులపై కూడా పోలీసులు తమ లాఠీలను ఝుళిపించలేని దుస్థితిలో ఉన్నారు. చేయకూడని తప్పు చేసి దొరికినా కూడా స్టేషన్‌కు వెళ్లగానే రాజకీయ పైరవీలు చేసి పోలీసుల చర్యలకు అడ్డు తగులుతున్న తీరు ప్రస్తుతం కనిపిస్తోంది. తప్పు చేసి కూడా ఖాకీలే తమను అకారణంగా వేధిస్తున్నారంటూ సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టి పోలీసులనే ఆత్మరక్షణలో పడేసే తీరును ప్రదర్శిస్తున్న కొందరు నిందితుల వ్యవహార శైలితో లాఠీలను పక్కన పడేయాల్సి వస్తోంది. రాజకీయ ఒత్తిళ్లు, ఇతరత్రా కారణాల నేపథ్యంలో పోలీసులు ఉన్నతాధికారులు సైతం సోషల్ మీడియాలో సంజాయిషీ చెప్పుకోవాల్సి వస్తుందంటే ఇక లా అండ్ ఆర్డర్‌ను కాపాడే నాథులెవరన్నది ప్రశ్నార్థకంగా మారుతోంది.

**భగవద్గీతపై ప్రమాణ దుస్థితేలా..?**

మన దేశ భవిష్యత్తును తరగతి గదులే నిర్దేశిస్తాయన్న విషయం అందరికీ తెలిసిందే. అలాంటి తరగతి గదిలో టీచర్ చేతులు కట్టేస్తే ఇక భావితరాల యువకుల్లో క్రమ శిక్షణ ఎక్కడి నుంచి వస్తుంది.? అలా ఈత బెత్తంతో పని లేని రోజులు వచ్చేసరికి సమాజంలో నేర ప్రవృత్తి నానాటికీ పెచ్చురిల్లిపోతోంది. మరోవైపు తప్పు చేస్తే పోలీసులు కూడా దండించలేని వింత పోకడ ఇప్పుడు కొనసాగుతోంది. తరగతి గదిలో టీచర్ దెబ్బల నుంచి తప్పించుకున్న విద్యార్థి ఆ తర్వాత పోలీస్ స్టేషన్ మెట్లెక్కాల్సిన సందర్భాలు వచ్చేస్తున్నాయి. ఇక అక్కడ కూడా లాఠీని మూలన పడేసిన పరిస్థితి అదుపు తప్పిన వారికి శిక్షలను మృగ్యంగా మార్చేస్తున్నాయి. ఈ కారణంగా అనివార్యంగా కోర్టు బోను వరకూ వెళుతున్న నేర చరితులు భగవద్గీతపై చేయి పెట్టి ప్రమాణం చేయాల్సిన స్థితి ఏర్పడుతోంది. తరగతి గదిలో బెత్తం, పోలీస్ ఠాణాలో లాఠీ తమ ధర్మాన్ని నిర్వర్తించి ఉంటే నేటి యువత కోర్టు మెట్లెక్కే రోజు రాకుండా ఉండేది. వయసుతో సంబంధంలేకుండా పిన్న వయసులోనే హత్యలు, అరాచకాలు, మాన భంగాలు, దురలవాట్లకు బానిసలవుతున్న యువతను మనం కళ్లారా చూస్తున్నాం. 15 ఏళ్ల వయసు మొదలుకుని 35 ఏళ్ల మద్య వయస్కులు నేర ప్రవృత్తిలో ఎక్కువగా ఉంటున్నట్లు పోలీసు రికార్డులే చెబుతున్నాయి. ఈ విస్పృంఖళ స్థితికి తరగతి గదిలో ఈత బెత్తం కనుమరుగవ్వడం, ఠాణాలో లాఠీ మూలన పడటమే ముఖ్య కారణాలని కచ్చితంగా చెప్పొచ్చు.

# భూ భారతి అవగాహన కార్యక్రమాలను విజయవంతం చేయాలి

**-ఏప్రిల్ 17 నుంచి 30 వరకు అవగాహన సదస్సులు**
**-షెడ్యూల్ విడుదల చేసిన ఇంచార్జ్ కలెక్టర్**



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ప్రజలకు ఉన్న భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి నూతన ఆర్‌వోఆర్ చట్టంపై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఇంచార్జ్ కలెక్టర్ పి. శ్రీజ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏప్రిల్ 17 నుంచి ఈనెల 30 వరకు ఖమ్మం జిల్లాలోని మండల కేంద్రాల్లో భూ భారతి చట్టంపై ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని ఆమె తెలిపారు. భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమాల నిర్వహణ, షెడ్యూల్‌పై విస్తృతంగా ప్రచారం కల్పించాలన్నారు. మండల కేంద్రంలోని ముఖ్యమైన ప్రదేశాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ వద్ద పోస్టర్‌లు ప్రదర్శించాలని, కరపత్రాలు తయారు చేసి గ్రామాల్లో పంచాలని ఇంచార్జ్ కలెక్టర్ తెలిపారు. ఏప్రిల్ 17 నుంచి 30 వరకు, ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు వరకు మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నియోజకవర్గ మండల కేంద్రాల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. బుధవారం నియోజక వర్గాల వారీగా అవగాహన సదస్సుల షెడ్యూల్‌ను ఇంచార్జ్ కలెక్టర్ విడుదల చేశారు. పాలేరు అసెంబ్లీ నియోజక వర్గంలో ఏప్రిల్ 17న ఉదయం తొమ్మిది గంటలకు నేలకొండపల్లి మండలంలో, ఏప్రిల్ 19న ఉదయం తొమ్మిది గంటలకు తిరుమలాయపాలెం మండలంలో, మధ్యాహ్నం రెండు గంటలకు కూసుమంచి మండలంలో, ఏప్రిల్ 21న ఉదయం తొమ్మిది గంటలకు ఖమ్మం రూరల్ మండలంలో అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. ఖమ్మం అసెంబ్లీ నియోజక వర్గంలో ఏప్రిల్ 21న మధ్యాహ్నం రెండు గంటలకు ఖమ్మం అర్బన్ మండలంలో, ఏప్రిల్ 22న ఉదయం తొమ్మిది గంటలకు రఘునాథపాలెం మండలంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మధిర అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలో ఏప్రిల్ 22న మధ్యాహ్నం రెండు గంటలకు ముదిగొండ మండలంలో, ఏప్రిల్ 23న ఉదయం తొమ్మిది గంటలకు మధిర మండలంలో, మధ్యాహ్నం రెండు గంటలకు ఎర్రుపాలెం మండలంలో, ఏప్రిల్ 24న ఉదయం తొమ్మిది గంటలకు చింతకాని మండలంలో, మధ్యాహ్నం రెండు గంటలకు బోనకల్ మండలంలో అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. వైరా నియోజక వర్గంలో ఏప్రిల్ 25న ఉదయం తొమ్మిది గంటలకు వైరా మండలంలో, మధ్యాహ్నం రెండు గంటలకు ఏన్కూరు మండలంలో, ఏప్రిల్ 26న ఉదయం తొమ్మిది గంటలకు కొణిజర్ల మండలంలో, మధ్యాహ్నం రెండు గంటలకు సింగరేణి మండలంలో అవగాహన సదస్సులు జరుగుతాయి. సత్తుపల్లి అసెంబ్లీ నియోజక వర్గంలో ఏప్రిల్ 28న ఉదయం తొమ్మిది గంటలకు సత్తుపల్లి మండలంలో, మధ్యాహ్నం రెండు గంటలకు వేంసూరు మండలంలో, ఏప్రిల్ 29న ఉదయం తొమ్మిది గంటలకు కల్లూరు మండలంలో, మధ్యాహ్నం రెండు గంటలకు పెనుబల్లి మండలంలో , ఏప్రిల్ 30న ఉదయం తొమ్మిది గంటలకు తల్లాడ మండలంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇల్లందు అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలో ఏప్రిల్ 30న మధ్యాహ్నం రెండు గంటలకు కామేపల్లి మండలంలో భూ భారతి చట్టంపై అవగాహన కార్యక్రమాలు జరుగుతాయని జిల్లాలోని రైతులు, భూ యజమానులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు తమ మండలాల పరిధిలో జరిగే అవగాహన కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ తెలిపారు.

# ఆడపిల్లతోనే ఇంటికి పరిపూర్ణత

**-స్వీట్ బాక్స్ ఇచ్చి శుభాకాంక్షలు తెలిపిన ఇంచార్జ్ కలెక్టర్ శ్రీజ**

ప్రజాపక్షం/రఘునాథపాలెం : ప్రేమానురాగాలకు ప్రతీకైన అమ్మాయి పుడితే ఇంటికి పరిపూర్ణత వస్తుందని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ డా॥ పి. శ్రీజ తెలిపారు. ఆడపిల్లలు జన్మించిన తల్లిదండ్రులు భారంగా కాకుండా వరంలా భావించాలని ఆడపిల్ల పుట్టడం అదృష్టమని తెలుపుతూ జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ రూపొందించి ప్రతి బుధవారం జిల్లా వ్యాప్తంగా జిల్లా అధికారులతో నిర్వహించే మా పాప మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో ఇంచార్జ్ కలెక్టర్ శ్రీజ పాల్గొన్నారు. రఘునాథపాలెం గ్రామంలోని వాంకుడోత్ సునీత నరేష్ దంపతులకు 2025 మార్చి 19న ఆడపిల్ల జన్మించిన విషయం తెలిసి బుధవారం ఇంచార్జ్ కలెక్టర్ వారి ఇంటికి వెళ్లి పాప తల్లిదండ్రులతో పాటు కుటుంబ సభ్యులను కలిసి స్వీట్ బాక్స్, ఫ్రూట్స్, సర్టిఫికెట్ అందించి శుభాకాంక్షలు తెలిపి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన ఆలోచనల్లో మార్పు వస్తే ఇంట్లో పుట్టిన ఆడపిల్లకు మన పిల్లలతో సమానంగా చూడటం జరుగుతుందన్నారు. ఆడపిల్లలకు మంచి విద్య, వారి అభివృద్ధికి ప్రోత్సాహం అందజేయాలన్నారు. ఆడపిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం అమ్మాయి ఆశించిన మేరకు చదువుకున్న తర్వాత ఉద్యోగం లేదా వ్యాపారంలో స్థిరపడి వారి భావాలకు గౌరవమిస్తూ కుటుంబ సభ్యులు తోడుగా నిలవాలన్నారు. స్త్రీ, పురుషుల మధ్య



వ్యత్యాసం సమాజంలో తొలగించాలని, సమాజంలో ఆడపిల్లల ఆవశ్యకత ఎలాంటిదో ఇంచార్జ్ కలెక్టర్ వివరించారు. జిల్లాలో ఏ ఇంట్లో ఆడపిల్ల పుట్టిన జిల్లా అధికారులు వెళ్లి తల్లిదండ్రులకు స్వీట్ బాక్స్ ఇచ్చి తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు అందిస్తున్నామన్నారు. ఖమ్మంజిల్లా వ్యాప్తంగా ఆడపిల్లల తల్లిదండ్రుల ఇంటికి జిల్లా అధికారులు వెళ్లి స్వీట్ బాక్స్, సర్టిఫికెట్ అందించి శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్‌రెడ్డి, జిల్లా ఉపాధి కల్పన అధికారిణి మాధవి, ఎంపిడివో అశోక్‌కుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిఎస్టి కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నిరసన

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఏఐసిసి అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ లపై ఈడీ చార్జ్‌షీట్ దాఖలును నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు ఖమ్మం జిఎస్టి కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఏఐసిసి పిలుపు మేరకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మం నగరంలోని జిఎస్టి కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజలు మాట్లాడుతూ దేశంలో బిజెపి నిరంకుశ పాలన సాగిస్తుందన్నారు. ప్రతిపక్ష పార్టీని నేరుగా ఎదుర్కొనలేక కాంగ్రెస్ అగ్ర నాయకులైన రాహుల్ గాంధీ, సోనియాగాంధీ లపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ చార్జ్‌షీట్ దాఖలు చేస్తున్నారని వారు ఆరోపించారు. బిజెపి జేబులో ఉన్నటువంటి రాజ్యాంగ సంస్థలైన ఈడి, ఆదాయ పన్ను లాంటి వాటిని వాడుకుని కేసులు బనాయించి వారి ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారన్నారు. బిజెపి ప్రభుత్వాన్ని భూస్థాపితం చేయడానికి కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. బిజెపి ప్రభుత్వం మోదీ, అమిత్‌షాలు కలిసి రాహుల్ గాంధీని, గాంధీ కుటుంబాన్ని అబాసుపాలు చేయాలని ఇలాంటి కుటిల రాజకీయాలకు ప్రయత్నిస్తున్నారన్నారు. గతంలో ఎటువంటి తప్పు లేదని కోర్టు తీర్పునిచ్చినా కేసును మళ్లీ బీహార్ ఎలక్షన్‌ను దృష్టిలో పెట్టుకుని



రాహుల్, సోనియా గాంధీ కుటుంబంపై తప్పుడు ఆరోపణలు చేస్తూ లబ్ది పొందాలని చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నగర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్ చౌదరి, ఏఎంసి చైర్మన్ యరగర్ల హన్మంతరావు, ఆత్మ చైర్మన్ దిరిశాల చిన్నవెంకటేశ్వరరావు, కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల నరేందర్, పైడిపల్లి రోహిణి సత్యనారాయణ, మలీదు వెంకటేశ్వరరావు, లకావత్ సైదులు, కొప్పెర సరిత, మందదపు లక్ష్మి మనోహర్, గజ్జెల లక్ష్మి వెంకన్న, పాకాలపాటి విజయనిర్మల శేషగిరి, రాపర్తి శరత్, కన్నం వైష్ణవి ప్రసన్న, కొత్తా సీతారాములు, సయ్యద్ గౌస్, మొక్కా శేఖర్ గౌడ్, బొడ్డు బొందయ్య, నాయకులు పాల్గొన్నారు.

# ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని వినతి



ప్రజాపక్షం/రఘునాథపాలెం : ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంపిడివో, తహసీల్దార్‌కు ఐఎన్‌టియుసి ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ రఘునాథపాలెం మండల కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఐఎన్‌టియుసి ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రఘునాథపాలెం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడివో అశోక్‌కుమార్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లూథర్ విల్సన్ లకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాన్ని వెంటనే చెల్లించాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత, హెల్త్ కార్డులు, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షులు, జిల్లా జాయింట్ సెక్రటరీ బరిగెల కోటేశ్వరరావు, రాష్ట్ర జనరల్ సెక్రటరీ చల్లా వెంకటేశ్వర్లు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సిహెచ్ రాధిక, జిల్లా ప్రధాన కార్యదర్శి తూరిగంటి సూర్యం, ప్రసాద్, నాగులమీరా, ఉపేందర్, శ్రీను, మస్తాన్, వెంకటేశ్వర్లు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# రజతోత్సవ సభను విజయవంతం చేయండి



ప్రజాపక్షం/జూలూరుపాడు: వరంగల్‌లో జరగనున్న బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్ లాల్ పిలుపునిచ్చారు. జూలూరుపాడు మండల కేంద్రంలోని ఏవిఆర్ ఫంక్షన్ హాల్ లో బుధవారం ఏర్పాటు చేసిన బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం సభ పోస్టర్లను కార్యకర్తల సమక్షంలో ఆవిష్కరింపచేశారు. తెలంగాణ రాష్ట్రంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వంలోనే పేదలకు సంక్షేమ పథకాలు అమలు అయ్యాయని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో మరల అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చలేదని, మాయమాటలతో ప్రజలను మోసం చేస్తుందని అన్నారు. కనీవిని ఎరుగని రీతిలో వరంగల్ లో బిఆర్ఎస్ పార్టీ సభ జరుగుతుందని, ప్రతి గ్రామం నుండి వేలాది మంది కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలిరావాలని కార్యకర్తలను కోరారు.

# అన్ని రంగాల్లో ఆడపిల్లలదే అగ్రస్థానం



ప్రజాపక్షం/పెనుబల్లి: విద్య, వైద్య, క్రీడారంగం తదితర అన్ని రంగాలలో మహిళలు సాధించే విజయాలు అగ్రస్థానంలో ఉన్నాయని మండల స్పెషల్ ఆఫీసర్ పురంధర్ అన్నారు. ఐసిడిఎస్ కల్లూరు ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పెనుబల్లిలో చల్లపల్లి సాయి రామకృష్ణ రమ్య దంపతుల గృహంలో నిర్వహించిన మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో పురంధర్ మాట్లాడుతూ ఆడపిల్లలను ప్రోత్సహించాలని ఐసిడిఎస్ ఆధ్వర్యంలో భేటీ జన్మోత్సవం కార్యక్రమంలో భాగంగా న్యూ బర్న్ బేబీ సెలబ్రేషన్స్ ప్రోగ్రాంను బాలింతల గృహాలకు వెళ్లి కుటుంబ సభ్యులందరినీ సన్మానించే విధానాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో పెనుబల్లి ఎంపీడీవో అన్నపూర్ణ, కల్లూరు ప్రాజెక్టు అధికారిని నిర్మల జ్యోతి, ఉపేంద్ర, సూపర్వైజర్ రాజ్యలక్ష్మి, పెనుబల్లి సెక్రటరీ, అంగన్‌వాడీ టీచర్స్ పద్మ, రాజకుమారి, కృష్ణకుమారి, రాజేశ్వరి, ఉష, లూరమ, గ్రామస్తులు పాల్గొని సాయి రామకృష్ణ రమ్య దంపతులను సన్మానించి స్వీట్ బాక్స్, ప్రశంసా పత్రం అందించి శాలువాలతో ఘనంగా సన్మానించారు.

# వనమా ఉమాదేవికి నివాళులర్పించిన సండ్ర



ప్రజాపక్షం/సత్తుపల్లి: పట్టణానికి చెందిన వనమా శ్రీనివాసుదేవరావు (వాసు) సతీమణి, వనమా ఉమాదేవి (లేటు) ప్రథమ వర్ధంతి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకట వీరయ్య హాజరై ఉమాదేవి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఘన నివాళ్ళులర్పించారు. సండ్ర వెంట పుర మాజీ చైర్మన్ కూసంపూడి మహేష్, కొత్తూరు ఉమా మహేశ్వరరావు, మల్లూరి అంకమరాజు, నరకుళ్ళ శ్రీనివాసరావు, చాంద్ పాషా, గండ్ర రఘు, మేకల నరసింహారావు, మిద్దె శ్రీను, వల్లభనేని పవన్, పర్వతనేని వేణు, మరికంటి శ్రీనివాసరావు, రామిశెట్టి కృష్ణ, వేదుళ్ళ నాగు, వినుకొండ వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

# ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ వారోత్సవాలు

ప్రజాపక్షం/సత్తుపల్లి: పోషణ పక్వాడ వారోత్సవాలలో భాగంగా బుధవారం మండల పరిధిలోని గంగారం శ్రీ అంగన్ వాడీ సెంటర్ నందు టీచర్ షకీనా బేగం ఆధ్వర్యంలో తల్లుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి సూపర్ వైజర్ గంగాజలం హాజరై గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన ఆహారం, ఆరోగ్యం తదితర విషయాలను వివరించి, పోషణ పక్వాడా ప్రతిజ్ఞ చేయించారు.అనంతరం గర్భిణీ స్త్రీలకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాను, ప్రమీల, ఆశా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కత్తి అరవింద్‌కు నివాళి

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు గ్రామపంచాయతీ నందు ఎస్సీ కాలనీ కి చెందిన కత్తి అరవింద్ అనారోగ్యంతో మృతిచెందగా విషయం తెలుసుకున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు లేళ్ల వెంకట్ రెడ్డి, వెంగన్నపాలెం మాజీ ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూదన్ రావులు ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు వేల్పుల నరసింహారావు, నర్వనేని పుల్లారావు, రాంజీ, మోదుగు రామకృష్ణ, పోతురాజు నాగరాజు, మంద సురేష్, మాదుగుల నాగరాజు, మంద దేవేందర్, పోతురాజు శీను, నారపోగు నరసింహారావు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## దేవుడు ఆంబోతుకు అంత్యక్రియలు



**ప్రజాపక్షం/పెనుబల్లి:** దేవుడు ఆంబోతు అనారోగ్యంతో మృతి చెందడంతో గ్రామ పెద్దలు ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. మండల పరిధిలోని తాళ్లపెంటకు చెందిన ఆంబోతు గత కొంతకాలంగా అనారోగ్యానికి గురై మంగళవారం సాయంత్రం మృతి చెందింది. బుధవారం ఉదయం గ్రామ పెద్దలు, గ్రామస్తులతో కలిసి ఆంబోతుని దేవుని స్వరూపంగా భావించి, ట్రాక్టర్ పై గ్రామం లోని పురవీధులు అన్ని కలియ తిరుగుతూ ఊరేగించారు. మహిళలు నీళ్లు ఆరబోస్తూ ఫలహారాలు చేశారు. మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించగా మహిళలు, పెద్దలు, గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. కన్నీటి పర్వతం అయ్యారు. ఉదయం నుండి సాయంత్రం వరకు జరిగిన ఊరేగింపులో అందరూ పాల్గొని అంత్యక్రియలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు సూరపురెడ్డి కిరణ్ రెడ్డి, కాకా సీతారాములు, పెద్దలు కొత్తగుండ్ల అప్పారావు, గువ్వల వెంకటరెడ్డి, మరకాల నరోత్తమ రెడ్డి, ముచెర్ల శివకృష్ణ ప్రసాద్, కాటినేని శ్రీను, పాంగళ్ల శ్రీను, దారా కృష్ణ, పరసా కన్నయ్య, గద్దల,సత్యం, మెడి గోపయ్య, వెదుల్ల శివ, కాటినేని శివ, దనసరి గోపాలరావు, మల్లి జయరాం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## దంపతులకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశానుసారం మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని వెంగళరావు నగర్ కాలనీకి చెందిన శ్రీనివాసరావు, కళ్యాణి దంపతులకు రెండవ సంతానంగా ఆడపిల్ల జన్మించింది. ఈ సందర్భంగా బుధవారం పాప తల్లిదండ్రులను మండల స్పెషల్ ఆఫీసర్ సునీల్ రెడ్డి, సిడిపిఓ కనకదుర్గ, మున్సిపల్ కమీషనర్ నరసింహులు కలుసుకుని వారిని అభినందించి, శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. అనంతరం స్వీట్లు, పండ్లు, సర్టిఫికెట్ అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ నేటి తరానికి ఆడపిల్లలే మా ఇంటి మణిదీపాలని, వారిని ఉన్నతంగా చదివించాలన్నారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ రజిని, అంగన్‌వాడీ టీచర్లు విజయమ్మ, రాణి, ఉష, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకలో పాల్గొన్న సిపిఐ నాయకులు



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిది లోని తనికెళ్లలో సిపిఐ నాయకుడు బాణోత్ రామయ్య వెంకటనర్సమ్మల ప్రథమ కుమార్తె వివాహ వేడుకలో సిపిఐ నాయకులు పాల్గొన్నారు. నూతన వధూవరులైన త్రివేణి, పృథ్వీరాజ్ లను సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సిపిఐ తనికెళ్ల గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా బాబు, జిల్లా నాయకులు తోట రమాంజనేయులు, జిల్లా నాయకులు పివి రావు, కొణపర్తి విష్ణుమూర్తి, పాపిట్ల ఏసు, బాణోత్ వెంకటేశ్వర్లు, గుగులోత్ కిషన్‌నాయక్, షేక్ జాని పాల్గొని ఆశీర్వదించారు.

## అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ ఏసీడీపీవో రత్నకుమారి సూచించారు. మండలం లోని తిరుమలాపురం అంగన్వాడీ కేంద్రాలలో బుధవారం పోషణ పక్షం కార్యక్రమం ను నిర్వహించారు. గర్భిణీలకు సీమంతం, చిన్నారులకు అన్నప్రసన్నా కార్యక్రమం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాలలో అందించే పౌష్టికాహారం ను తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యకరమైన వంటలను తినాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యం.యర్రయ్య, సూపర్వైజర్ పి.నాగమణి, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా కార్యకర్తలు. తల్లులు తదితరులు పాల్గొన్నారు. మా ఇంటి మణిదీపం కార్యక్రమం తిరుమలాపురం గ్రామంలో మా ఇంటి మణిదీపం కార్యక్రమంను నిర్వహించారు. ఆడబిడ పుట్టిన ఇంటికి వెళ్లి తలిదండ్రులను సన్మానించారు. చిన్నారిని ఆశ్వీరదించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ రవి బాబు, ఎంపీడీఓ యం.యర్రయ్య, సూపర్వైజర్ పి.నాగమణి, విజయకుమారి, అంగన్వాడీ టీచర్లు, ఆశా, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# శుక్రవారం శుభ్రతకు మంగళం..!

**-జిల్లా యంత్రాంగం ఊసేలేని ఫ్రైడే డ్రైడే**
**-మున్సిపాలిటీలు, పంచాయతీల్లో పారిశుధ్యం పడక**





(ఫైల్)



**ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ :** ఒక సాధారణ మహిళా సర్పంచ్ మదిలో మొదలైన బృహత్తర ఆలోచన రాష్ట్ర వ్యాప్త కార్యక్రమానికి నాంది పలికింది. ఈ కార్యక్రమాన్ని పట్టాలెక్కించిన జిల్లా యంత్రాంగం కూడా అద్భుత ఫలితాలను సాధించింది. మరి ఇప్పుడు ఫ్రైడే డ్రైడే అంటే ఎంత మందికి తెలుసు. జిల్లా యంత్రాంగంలో కీలకంగా వ్యహరించే అధికారులకే దీని మీద పూర్తి స్థాయిలో అవగాహన లేదంటే అతిశయోక్తి కాదు. మహిళా సర్పంచ్ లేవనెత్తిన ఆలోచనకు అనుగుణంగా వారంలో ఒక రోజు పారిశుధ్యం కోసం కేటాయించాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. ఆరోజు శుక్రవారం కావడంతో ఆ కార్యక్రమానికి ఫ్రైడే డ్రైడే అని నామకరణం చేశారు. ఈ కార్యక్రమం పట్టాలెక్కిన తర్వాత నుంచి జిల్లా స్థాయిలో ప్రతి శుక్రవారం అధికార యంత్రాంగం మొదలుకుని పట్టణ, మండల, గ్రామస్థాయి అధికారుల వరకు బయటకు కదిలేవారు. ఆరోజున అన్ని మున్సిపాలిటీలు, పంచాయతీలలో పారిశుధ్య కార్యక్రమం ఊవ్వెత్తున సాగేది. డ్రైనేజీలను శుభ్రపర్చడం, రోడ్ల వెంబడి ఉన్న చెత్తను తొలగించడంతో పాటు రక్షిత మంచినీటిని సరఫరా చేసే నీటి ట్యాంకులను కూడా శుభ్రం చేసే వారు. ఈ కార్యక్రమంలో గ్రామ పట్టణ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులతో పాటు అంగన్‌వాడీ, ఏఎన్ఎం, ఆశావర్కర్లు విధిగా పాల్గొనే వారు. అలాగే పల్లెల్లో, పట్టణాల్లో ఉండే ప్రభుత్వ పాఠశాలల అధ్యాపకులు, విద్యార్థులు ప్రతి శుక్రవారం పారిశుధ్య కార్యక్రమానికి కదిలి వచ్చే వారు. ఈ కార్యక్రమం వారంలో నాలుగుసార్లు పట్టణాలు, పల్లెలు పరిశుభ్రంగా మారి కొత్త అందాన్ని సంతరించుకునేవి. వర్షాకాలంలోనూ గ్రామీణ ప్రాంతాలు అపరిశుభ్రత బారీనపడేవి కావు.

### నీళ్లొదిలిన యంత్రాంగం...

ఎంతో బృహత్తర కార్యక్రమమైన ఫ్రైడే డ్రైడే కార్యక్రమానికి కాల క్రమేణ ప్రభుత్వ యంత్రాంగం నీళ్ల వదులుతూ వస్తుంది. గడిచిన కొన్నేళ్లలో ప్రతి శుక్రవారం పారిశుధ్యం అనే కార్యక్రమం ఊసే లేకుండాపోయింది. దీనితో మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం పడకేస్తూ వచ్చింది. పారిశుధ్యం కోసం కోట్లు వెచ్చిస్తున్న సర్కార్ వెచ్చించిన నిధులన్నింటిని నీళ్లలోనే పోస్తుంది. ప్రణాళికేత విధానం లేకపోవడంతో నిధులన్ని దుబారా అవుతున్నాయే తప్ప ఫలితం మాత్రం మచ్చుకైనా కనిపించడం లేదు. తాజాగా జిల్లా అధికార యంత్రాంగం ఈ బృహత్తర కార్యక్రమాన్ని పట్టాలెక్కించే దిశగా చర్యలు తీసుకుంటే మంచి ఫలితాలకు ఆస్కారం ఉంటుందని పలువురు కోరుతున్నారు.

## సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు అవగాహన పరిచే విధంగా కార్యకర్తలు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ పిలుపునిచ్చారు. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆదేశాల మేరకు మంగళవారం మండల పరిధిలోని మర్లపాడు, సైదల్లీపురం,నాగవరప్పాడు, ఆత్కూరు, ఖాజీపురం, మాటూరుపేట, మాటూరు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు విస్తృతంగా పర్యటించి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా గ్రామ సెంటర్లల్లో ఏర్పాటు చేయనున్న ఫెక్సీలు, హోర్డింగ్స్‌కు స్థలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీసెల్ మండల అధ్యక్షులు దారా బాలరాజు, నాయకులు కర్నాటి రామారావు, గ్రామశాఖ అధ్యక్షులు పులిబండ్ల చిట్టిబాబు, నెల్లూరి కమలాకర్, కృష్ణారెడ్డి, నర్సింహారావు, అచ్చయ్య, మోదుగు గోపాలరావు, సత్యానందం, మీనుగు చైతన్య, ఖమ్మంపాటి రవికుమార్, క్లస్టర్స్ ఇన్ చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

## ఏరియా పర్సనల్ డిపార్ట్‌మెంట్ సమీక్ష సమావేశం



**ప్రజాపక్షం/మణుగూరు:** జనరల్ మేనేజర్ కార్యాలయ సమావేశ మందిరం నందు బుధవారం డీజీఎం పర్సనల్ ఎస్. రమేష్ అధ్యక్షతన ఏరియా పర్సనల్ డిపార్ట్ మెంట్ లకు సంబంధించిన సంక్షేమ అధికారులు, పి.ఓ.ఏ లు, ఆయా డిపార్ట్ మెంట్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీఎం పర్సనల్ ఎస్. రమేష్ ముందుగా 2020, 2021, 2022, 2023, 2024 సంవత్సరాలలో గైర్హాజరు అయిన కార్మికుల చార్జిషీట్ ఎంక్వైరీ ప్రక్రియ సమీక్షించారు. అనంతరం ఇతర కారణాల వల్ల చార్జిషీట్ పొందిన ఉద్యోగుల ఎంక్వైరీ స్టేటస్ ను సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ సంక్షేమ విభాగం విధులు ఎంతో బాధ్యతాయుతమైనవన్నారు. ఉద్యోగుల పదవి విరమణ, బెనిఫిట్స్, సి.ఎం.పి.ఎఫ్, పెన్షన్, గ్రాట్యుటీ, అదే విధంగా హెచ్.బి.ఎల్.ఐ.ఆర్.ఎస్/ సిపిఆర్ఎంఎస్ క్లైమ్స్ కొరకు సంబంధిత ఉద్యోగుల నుంచి తగిన డాక్యుమెంట్స్ తీసుకొని వాటిని సకాలంలో క్లియర్ చేయాలన్నారు. కోర్ట్ కేసుల పురోగతి వివరాలు వెబ్సైట్ లో ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలన్నారు. సింగరేణి ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగుల కార్పొరేట్ సాలరీ అకౌంట్ ఓపెనింగ్ వివరాలు ఎప్పటికప్పు అడిగి తెలుసుకోవాలన్నారు. ప్రతి నెల 5వ తేదీ లోపు గైర్హాజరు ఉద్యోగులకు ఉద్యోగం విలువ తెలిసి వచ్చేలా కౌన్సిలింగ్ ద్వారా అవగాహన కల్పించాలన్నారు. క్వార్టర్స్ నియామకం, పీనల్ రెంట్, హెచ్ఎస్ఏ, క్వార్టర్స్ ఎప్పటికప్పుడు డిజిటలైజేషన్ చేయాలని సూచనలిస్తూ అర్హత గల పెన్షన్ హోల్డర్స్ యొక్క రీవైజిడ్ పిపిఓ ఇష్యూ చేయడానికి సంబంధిత పత్రాల సేకరణ వివరాలను తెలుసుకున్నారు. క్యాడర్ స్కీమ్ ప్రోమోషన్స్ స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. సిఎంపిఎఫ్ పోర్టల్ , ఉద్యోగ పర్సనల్ వివరములతో కూడిన ఎంప్లాయి పర్సనల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ పోర్టల్ వినియోగించుటకు ఉద్యోగులలో అవగాహన పెంపొందించాలని సూచించారు. మాజీ ఉద్యోగులు సిపిఆర్ఎంఎస్, పెన్షన్ రినివల్ కొరకు మీసేవ సెంటర్ లో రెన్యువల్ చేసుకోవాలని తెలిపారు. విఐపి/ వివిఐపి ద్వారా వచ్చిన దరఖాస్తులను సంబంధిత వెబ్ సైట్ లో వెంటనే అప్ లోడ్ చేయాలని సూచించారు. పర్సనల్ డిపార్ట్మెంట్ ఉద్యోగులు, డిప్యూటీ పర్సనల్ మేనేజర్, సీనియర్ పర్సనల్ అధికారులు సంక్షేమ అధికారులు, మినిస్ట్రియల్ సిబ్బంది మరింత నిబద్ధతతో పని చేస్తూ పారదర్శకంగా తమ వంతు సేవలు అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో డిజిఎం (పర్సనల్) ఎస్ రమేశ్ , సీనియర్ పిఓలు సింగు శ్రీనివాస్ , వి రామేశ్వర రావు, ఓంకార్ బాపు, డి. నరేశ్, మేనేజ్మెంట్ ట్రైనీ ( పర్సనల్) సాయి శ్వేత, అరుణ్ తేజ, వంశీ కృష్ణ, డిప్యూటీ సూపరింటెండెంట్ పి.లక్ష్మణ్ రావు, మధు, ఎం. నరసింహ రావు, ఎన్వి రావు, ఓసి4 పిఏ ఎండి షాబుద్దీన్, ఎండి సుభాని, అన్నీ విభాగాల మినిస్ట్రియల్ స్టాఫ్ పాల్గొన్నారు.

# గొల్లపూడి రైతుల గోస



**-60 ఎకరాల్లో నేలకొరిగిన వరి**
**-20 ఎకరాల్లో పూర్తిగా నేలపై పడిన వడ్లు**
**-కన్నీరు పెడుతున్న రైతులు**


**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం గొల్లపూడి గ్రామ రైతులను గాలి దుమారం వర్షం నట్టేట ముంచింది. దీంతో గొల్లపూడి రైతుల గోస చెప్పలేని విధంగా ఉంది. గాలి దుమారం వర్షానికి సుమారు 60 ఎకరాల్లో వరి పూర్తిగా క్రిందపడిపోయింది. 20 ఎకరాల్లో వరి కంకి అనేది ఎక్కడ కనిపించకుండా వడ్లు మొత్తం క్రింద పడిపోయాయి. 40 ఎకరాల్లో సగానికి పైగా వడ్లు నేలకు రాలిపోయాయి. దీంతో ఆ గ్రామ రైతులు కన్నీరుపర్యంతమవుతున్నారు. చేతికొచ్చిన పంట అకాల వర్షానికి నేలకొరిగి వరి ధాన్యం రాలిపోయింది. ఎవరికి చెప్పుకోవాలి మా బాధ ఎలా మేము బ్రతికేది మా అప్పులు ఎలా తీరని ఆ రైతులు కుటుంబాలు బోరన విలపిస్తున్నారు. రెండు వరి కోయాలి అనుకున్నా రైతులకు గాలి దుమారం వచ్చి పండిన పంటను నేలపాలు చేసింది. ప్రకృతి ప్రళయం ఆ గ్రామ రైతుల పాలిట శాపంగా మారింది. దీంతో పొలాల వద్దకు వెళ్లిన రైతులు వారి కుటుంబ సభ్యులు పడిపోయిన వరిని చూసి కనీసం ఉన్న వడ్లు అయినా కాపాడుకుందాం అనే ప్రయత్నం చేసినా కూడా వారికి అనుకూలించలేదు. ఎందుకంటే అప్పటికే వరి కంకులు వడ్లు పూర్తిగా నేలరాలిపోయాయి. తెచ్చిన అప్పులు ఎలా తీరుతాయి. ఇచ్చిన వారు ఎలా ఊరుకుంటారు. ఇప్పుడు పంట చేతికి వచ్చే సమయానికి గాలి దుమారానికి నేలకు ఒరిగి రాలిపోయింది. ప్రభుత్వం మమ్ముల్ని ఆదుకోవాలని రైతులు కోరుకుంటున్నారు.

### ప్రభుత్వమే ఆదుకోవాలి : రొంటే హనుమంతరావు(రైతు)



వరి కోతకు వచ్చింది కొద్దామని అనుకున్న తరుణంలో వచ్చిన గాలి తుఫాన్‌కు వరి పంట పూర్తిగా నేలకొరిగింది. దీంతో కంకులు ఉన్న వడ్లు రాలిపోయాయి. ఇప్పుడు పంట కోద్దామన్నా కోసే పరిస్థితి లేకుండా పోయింది. అధికారులు పంట పొలాలను చూసి ప్రభుత్వం నుంచి మమ్ముల్ని ఆదుకోవాలి.

### పంట చేతికొచ్చే దశలో నేలపాలైంది : కేశవరావు, రైతు



వచ్చిన గాలి దుమారం గ్రామ రైతుల పాలిట శాపంగా మారింది. ప్రకృతి మా ఊరిపై పగబట్టింది. అందుకే చేతికొచ్చిన వరి నేలకొరిగింది. ఇంటికి రావాల్సిన ధాన్యం చేలోనే రాలిపోయింది. పొలం వద్దకు వెళ్లి చూస్తే మా కళ్ళ నీరు కారిపోతుంది. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

## విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి



**-ఎంఎల్ఏ జారే ఆదినారాయణ**

**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు అశ్వారావుపేట ఎంఎల్ఏ జారే ఆదినారాయణ అన్నారు. బుధవారం మండలంలో పలు పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక వసతుల కోసం రూ 83లక్షలు పై చిలుకు నిధులతో త్రాగునీటి, ట్యాంకులు, మరుగుదొడ్లు , డిజిటల్ క్లాసులు నిర్వహణకు విద్యుత్ సౌకర్యాలు వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆ నిధులతో అభివృద్ధి పనులు పూర్త ఇకావడంతో వాటిని ప్రారంభించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలపై ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూరు చేశారన్నారు. ప్రైవేటు పాఠశాలల ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని, విద్యార్థుల తల్లిదండ్రులు వీటిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. పాఠశాలలో ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, తీసుకొచ్చిన వెంటనే చర్యలు చేపడతామన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత వసతులు కల్పనలో లోపాలు లేకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దారం గోవింద్‌రెడ్డి, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో అశోక్, ఎంఈవో సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు భోజ్య నాయక్, నల్లమోతు రమణ, సారేపల్లి శేఖర్, ఫజల్ బక్ష, చంద్రు విజయ్, బదుగు కృష్ణవేణి, బొర్రా సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు సహకరించండి




**ప్రజాపక్షం/బూర్గంపాడు:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపనకు గత రెండు నెలల నుండి అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని అంబేద్కర్ కమిటీ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలో స్థానిక ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపనకు ప్రభుత్వ స్థలం ఉన్నా, ఆ స్థలంలో ప్రతిష్టించడానికి కొందరు వ్యక్తులు అడ్డుపడుతున్నారని, అదే స్థలంలో అక్రమంగా వేరే నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు మౌనంగా ఉంటుందన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించే విషయంలో ఎన్ని సార్లు దళిత సంఘాలు స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, ఆ స్థలాన్ని ప్రభుత్వ స్థలంగానైనా లేదా ప్రైవేట్ స్థలంగానైనా గుర్తించమని కోరినా ఇంత వరకు ఏ విధంగాను స్పందించలేదని ఆరోపించారు. తమ స్వలాభం కోసం స్థలం అడగట్లేదని రాజ్యాంగ నిర్మాణ కర్త డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించాలని అంబేద్కర్ భవనాన్ని ఏర్పాటు చేయాలని, పదే పదే అధికారులను కోరిన ఎందుకు తాత్సారం చేస్తున్నారో అర్థం కావట్లేదని వారన్నారు. కొంత మంది ప్రైవేటు వ్యక్తులు అక్రమంగా ఆ స్థలంలో నిర్మాణాలు చేపడుతున్న ఇదే విషయంపై అధికారుల దృష్టికి తీసుకెళ్లిన స్పందించకపోవడం బాధ కలిగిస్తుందని వాపోయారు. ఈ అంబేద్కర్ ప్రతిష్టాపన కొరకు జిల్లా కలెక్టర్ స్పందించి ఆ స్థలాన్ని అంబేద్కర్ విగ్రహానికి కేటాయించాలని ప్రతిక ముఖంగా కోరుతున్నామన్నారు. అక్రమ నిర్మాణాలను తక్షణమే నిలిపివేసి అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కెరారు. రాజ్యాంగాన్ని నిర్మించిన డాక్టర్ అంబేద్కర్ విగ్రహం ప్రతిష్టించడానికి మేము ప్రయత్నిస్తుంటే మాపై భౌతిక దాడులకు దిగుతున్నారని తమకు రక్షణ కల్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో అంబేద్కర్ కమిటీ కన్వీనర్ ఇరుగు ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఇస్తాం శ్రీనివాసరావు, కోకన్వీనర్ తుమ్మల కిరణ్, కోశాధికారి కొట్టే అనిల్, కార్యదర్శి సూదిపాక ఈశ్వర్, గంటా మల్లికార్జున్, కార్యవర్గ సభ్యులు గాడిద రాంబాబు, కాకటి కొండయ్య, కొత్తపల్లి కోటేశ్వరరావు, గంట సాయికుమార్, కేసరి శ్రీను, చేపూరి ఈశ్వర్, జిలుగు దాసు, గాడిద మోహన్‌రావు, మేక శేషమ్మ, వెంకటేశ్వర్లు, లాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కష్టాల కడలిలో చీమలపాడు గ్రామ ప్రజలు



**ప్రజాపక్షం/కారేపల్లి:** సంక్షేమ పథకాలు అమలు జరగక, రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరా ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, వంటి సంక్షేమ పథకాలు అమలు కాకపోవడం వలన గ్రామాలకు నిధులు ప్రభుత్వం ఇవ్వకపోవడం వల్ల కష్టాలకడలిలో చీమలపాడు గ్రామం గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం నిర్వహించిన గ్రామ సర్వేలలో ప్రజలు చెబుతున్నారని ఈ సమస్యల పరిష్కారం కోసం గ్రామ స్థాయి నుండి పోరాటాలు సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలు నిర్వహిస్తారని సిపిఎం చీమలపాడు శాఖ కార్యదర్శి యనమనగండ్ల రవి మండల కమిటీ సభ్యులు అజ్మీర ఆ శోభన్ బాబు తెలిపారు. గ్రామంలో ప్రజలు ఇందిరమ్మ ఇండ్లు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా రైతు భరోసా రైతు రుణమాఫీ గిరిజన ఇతరులకు ఇవ్వవలసిన హక్కు పత్రాలను ఎదుర్కొంటున్నారని ఆ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఉద్యమిస్తారని ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సర్వేలో సిపిఎం పార్టీ సభ్యులు రాచర్ల రణధీర్, గోకినపల్లి భారతి లక్ష్మి , ధరావత్ వినోద్, కిషన్, మంజిలాల్, నరసింహారావుపాల్గొన్నారు.

## విద్యాశాఖ ఆధ్వర్యంలో అలిమ్కో సంస్థ వాహనాల పంపిణీ



**ప్రజాపక్షం/ములకలపల్లి:** మండల విద్యాశాఖాధికారి జి సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం దివ్యాంగులకు అలిమ్కో సంస్థ వారి ఉచిత ఉపకరణాలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా ఎంపీడీవో రేవతి హాజరయ్యారు. ఎంపీడీవో, ఎంఈవో వాహనాలను మంచిగా సద్వినియోగం చేసుకోవాలని, సలహాలు, సూచనలను పిల్లలకు తల్లిదండ్రులకు వివరించారు. ఈకార్యక్రమంలో భాగంగా ప్రతి బుధవారం జరిగే ఫిజియోథెరపీ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ శ్రీదేవి, ఐఇఆపి కె రాజశ్రీ, మండల విద్యావనరుల కేంద్ర సిబ్బంది, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రైతులకు నష్టం జరగకుండా భూసేకరణ



**ప్రజాపక్షం/ఖమ్మం :** సీతారామ ప్రాజెక్ట్ మెయిన్ కాలువ నుండి పంట కాలువల నిర్మాణం కోసం భూ సేకరణపై రైతులకు ఎటువంటి నష్టం జరగకుండా చర్యలు చేపడుతామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్తీక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని చంద్రుగొండ, తిప్పనపల్లి, మద్దుకేరు గ్రామ పంచాయితీ కార్యాలయంలో జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో పంట కాలువ నిర్మాణం కోసం 547=07 ఎకరాల భూ సేకరణ చేయాల్సిందన్నారు. ప్రభుత్వం మార్కెట్ ధర ప్రకారం నాలుగు రేట్లు అధికంగా రైతులకు నష్టపరిహారం అందించడం జరుగుతుందని తెలిపారు. రైతులు నిరభ్యంతరంగా తమ అభ్యంతరాలను అధికారులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీతారామ ప్రాజెక్ట్ ఇరిగేషన్ డిఈ వెంకటేశ్వరరావు, పంచాయితీ సెక్రటరీ రాజేందర్, మాజీ జెడ్పిటిసి కొణకండ్ల వెంకటరెడ్డి, రైతులు పెద్దిని వేణు, భోగి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు పెరిగిన పని భారం కనుగునంగా రోజువారి విధులకు తీసుకునే కార్మికుల సంఖ్యను పెంచాలని, రక్షణ చర్యలు చేపట్టాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆధ్వర్యంలో బుధవారం మెయిన్ హాస్పిటల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్ కిరణ్ రాజ్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు కృష్ణయ్య, ఉపాధ్యక్షులు కేడబ్ల్యూ కిష్టాఫర్ లు మాట్లాడుతూ, గత 20 సంవత్సరాలు పైగా పనిచేస్తున్న హౌస్ కీపింగ్ క్లీనింగ్ కాంట్రాక్ట్ కార్మికులు అరకోర మస్టర్లతో, చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారికి నెలకు కనీసం 26 మాస్టర్లు వచ్చేటట్లుగా చర్యలు చేపట్టాలని నాయకులు కోరారు. సింగరేణి మెయిన్ హాస్పిటల్ రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో కాంట్రాక్ట్ కార్మికులకు పెరుగుతున్న పని భారంను పరిగణలోకి తీసుకోవాలని, వారికి మెరుగైన వైద్యం, సరైన రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సతీష్, విజయ్, రమేష్, రాంబాబు, లలిత, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### ఆడపిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసమే

# 'మా ఇంటికి మణిదీపం'



ప్రజాపక్షం/చింతకాని : ఆడపిల్లల సంరక్షణ కోసమే మా ఇంటికి మణిదీపం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారిణి

**డీపీఓ ఆశాలత**

ఆశాలత పేర్కొన్నారు. బుధవారం మండలపరిధిలోని గాంధీనగర్ గ్రామంలో మేడా నాగరాజు గౌతమి దంపతులకు రెండవ ఆడపిల్ల జన్మించడంతో ఇంటికి వెళ్లి వారిని సన్మానించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖలతో కలిసి ఆడపిల్లల ప్రాముఖ్యతను వివరిస్తున్నామన్నారు. ఆడపిల్ల పుడితే మహాలక్ష్మి వచ్చినట్లేనని కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరుస్తాయన్నారు.ఆడపిల్లలను సంరక్షించాల్సిన భాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషినల్ సీడీపీవో శివమ్మ, గ్రామపెద్దలు కొల్లి గోవిందరావు, మాజీ ఉపసర్పంచ్ దొబ్బల విజయ, హెల్త్ సూపర్వైజర్లు, ఏఎన్ఎం, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

# డ్రైనేజీ లేక నిలిచిన మురుగునీరు..!

**-దుర్వాసనతో ఇబ్బందిపడుతున్న 9వ వార్డు ప్రజలు**
**-మున్సిపల్ అధికారులు నీటిని తొలగించాలని వేడుకోలు**







ప్రజాపక్షం/వైరాః వైరా మున్సిపాలిటీ 9వ వార్డులో మధిర వెళ్లే రహదారి ప్రక్కన డ్రైనేజీ నిర్మాణం లేకపోవడం వలన నీరు నిల్వ ఉండి దుర్వాసనలు వెదజల్లుతున్నాయి. ఈదుర్వాసనలతో చుట్టుప్రక్కల ఉన్న నివాసాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో రోడ్డుకు వద్దామనుకుంటే దుర్వాసన భరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు ఎలాంటి విష పురుగులు ఈ ప్రాంతంలో సంచరిస్తారని ఆందోళన చెందుతున్నారు. అసలు ఈప్రాంతంపై ఎందుకు అతం చిన్న చూపు చూస్తున్నారు. పారిశుద్ధ్యంపై ఎందుకు పట్టించుకోవడం లేదు. డ్రైనేజీ నిర్మాణంపై ఎందుకు చర్యలు చేపట్టడం లేదు అని ఆ ప్రాంత ప్రజలు ప్రశ్నిస్తూ స్థానికులు నిరసన చేపట్టారు. నివాస ప్రాంతాల మధ్య నిలిచిపోయిన మురికి నీరు తొలగించాలని డిమాండ్ చేశారు. నివాసాల మధ్య మురికి నీరు చేరడంతో దుర్వాసన దోమలమయంతో ఇబ్బందులు గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. వైరా మున్సిపాలిటీ రింగు రోడ్డు నుండి ఇందిరమ్మ కాలనీ వరకు రూ.12కోట్లతో నాలుగు లైన్ల రోడ్డు మంజూరైంది. కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణం చేపట్టి సంవత్సరం గడుస్తున్నా నేటికి పనులు పూర్తి కాలేదు. ప్రధాన రహదారి ప్రక్కన గతంలో ఉన్న డ్రైనేజీని తొలగించడంతో ఆర్టిసి బస్టాండ్ ఏరియా నుంచి మధిర రోడ్డు వైపు నుంచి వచ్చే మురికి నీరు నివాస ప్రాంతాల్లో నిలిచిపోవడంతో 9వ వార్డు ప్రాంతం మురికి కూపంగా మారింది. దీంతోపారిశుద్ధ్యం లోపించి స్థానిక ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాల్ శాఖ అధికారులు డ్రైనేజీలు నిర్మాణం చేపట్టి పారిశుద్ధ్య లోపం లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రరమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఐకెపి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : ఎర్రుపాలెం మండలంలోని మామునూరు, బనిగండ్లపాడు, జమలాపురం గ్రామాల్లో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి అలీమ్, ఎంపిడిఓ సురేంద్, ఎపిఎం హరినారాయణ, మండల ఉపాధ్యక్షులు శీలం శ్రీనివాస్‌రెడ్డి, షేక్.జానిబాషీ, క్లస్టర్ ఇన్‌చార్జి కడియం శ్రీనివాసరావు, శీలం వెంకటరామిరెడ్డి, మార్కెటింగ్ డైరెక్టర్లు



యన్నం పిచ్చిరెడ్డి, వేమిరెడ్డి అనురాధ, గూడేటి బాబరావు తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజాపక్షం/వైరాః వైరా మండలం ముసలిమడుగు, గన్నవరం గ్రామాల్లో డిసిఎంఎస్, ఐకెపి ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వైరా తహాశీల్దార్ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైరా మండల కాంగ్రేస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, డిసిఎంఎస్ సిబ్బంది, ఐకెపి సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది, గ్రామ నాయకులు, రైతులు నర్వనేని గోపాలరావు, చింతనిప్పు శ్రీనివాస్, అనుమోలు స్వామి, తడికమళ్ల నాగార్జున, చింతనిప్పు రామారావు, కేతవరపు వెంకటేశ్వర్లు, చింతనిప్పు కృష్ణారావు, గుడిమెట్ల సుబ్బారెడ్డి, చింతనిప్పు బాబు, కొరివి వెంకటి, అంకం శ్రీను, అంకం నాగమణి, గన్నవరం గ్రామ రైతులు శీలం రంగారెడ్డి, యన్నం వెంకటకోటారెడ్డి, అయి



లూరి కోటారెడ్డి, గన్నవరం మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, యరమల రవీంద్రరెడ్డి, రంగిశెట్టి శ్రీనివాస్, కోరె క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఏపూరి బ్రహ్మాం స్తూప నిర్మాణం ప్రారంభం

ప్రజాపక్షం/ఖమ్మం : ఏఐకేఎస్ సభ్యులు, సీపీఐ అనుబంధ రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఏపూరి బ్రహ్మాం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం విధితమే..ఈ మేరకు బుధవారం ఆయన స్థూప నిర్మాణ పనులను స్థానిక జే.కే.కాలనీలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె.సారయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దేవర



కొండ శంకర్, బంధం నాగయ్య, మాజీ వైస్ ఛైర్మన్ బాస శ్రీనివాస్, నాయకులు బొల్లి కొమరయ్య, మంచాల వెంకటేశ్వర్లు, ఉడత ఐలయ్య, గుగులోత్ కృష్ణ, బొబ్బిశెట్టి సత్యనారాయణ, వడ్ల శ్రీను, రాఘవేంద్రరావు, ఎస్.కె.వలీ, నెల్లి కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి పవర్ లిఫ్టింగ్‌లో సిల్వర్ మెడల్ విజేతకు అభినందనలు

ప్రజాపక్షం/మధిర : జిల్లాస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో అండర్ 17 విభాగంలో సెయింట్ ప్రాన్సిస్ స్కూల్‌లో 9వ తరగతి విద్యార్థి వడ్లమూడి వెంకటేశ్వర్లు రెండవస్థానంలో నిలిచి సిల్వర్ మెడల్‌ను సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ ఆన్‌బేబీ తెలిపారు. బుధవారం స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో సిల్వర్ మెడల్ సాధించిన వెంకటేశ్వర్లును అభినందించారు. ఈ నెల 19వ తేదీన రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు ఖమ్మం జిల్లా నుండి ఎంపిక కావటం పట్ల ఆమెతో పాటు ఉపాధ్యాయులు, యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాపక్షం/ మధిర రూరల్ : మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో రైతు వేదిక వద్ద ఐకెపి ఆధ్వర్యంలో వరి సేకరణ కేంద్రాన్ని బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా



పాలన ద్వారా రైతులకు మేలు చేసే విధంగా ధాన్యం సేకరణ చేపట్టేందుకు చర్యలు తీసుకోవటం జరుగుతుందని, రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిఓ శ్రీనివాసరావు, మధిర మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఐలూరి సత్యనారాయణరెడ్డి, డైరెక్టర్ అద్దంకి రవికుమార్, ఆత్మ కమిటీ డైరెక్టర్ దుంప వెంకటేశ్వరరెడ్డి, నాయకులు వేమిరెడ్డి లక్ష్మారెడ్డి, ఖమ్మంపాటి సునందరావు, నంద్రు విజయరావు, ఐకెపి సభ్యురాలు యామాల రాధ, శీలం వెంకటరావమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## పూసలపాడులో పర్యటించిన వ్యవసాయ అధికారులు

ప్రజాపక్షం/వైరాః వైరా మండలం పూసలపాడు గ్రామంలో వైరా ఏడిఏ తుమ్మల పల్లి కరుణశ్రీ, మండల వ్యవసాయ అధికారి మంజుఖాన్ ఏఈవో కీర్తి పర్యటించారు. గ్రామంలో ఇటీవల వర్షానికి పడిపోయిన వరి పొలాలను




వారు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను అడిగి నష్టలను తెలుసుకున్నారు. పంట నష్టం నమోదు తీసుకోవడం జరిగిందని ఏడిఏ కరుణశ్రీ తెలిపారు. పడిపోయిన పంట పొలాల వద్దకు ఏఈవోలు వస్తారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

## రక్షిత మంచినీటిని అందించాలి

ప్రజాపక్షం/ మధిర : మధిర మున్సిపాల్టీ పరిధిలోని 18వ వార్డులో మంచినీటి కుళాయిల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతు న్నాయని, వెంటనే అధికారులు స్పందించి రక్షిత మంచినీటిని సరఫరా చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు. గత 15రోజులుగా మంచినీటి కుళాయిల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతున్న విషయంపై సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవటం లేదని వార్డు ప్రజలు వాపోతున్నారు. మంచినీరు అనేది జీవులకు అత్యవసరం అని, కలుషిత నీరు తాగటం వలన అనేక రోగాల బారిన పడాల్సిన పరిస్థితి వస్తుందని, మినరల్ వాటర్ కొనుక్కునే తాగే పరిస్థితి లేని సామాన్య కుటుంబాలు మావని, అనారోగ్యం పాలైతే కార్పోరేట్ హాస్పటల్స్‌కు పోయే స్థితి మాకు లేదని తమ ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ముప్సిపాల్టీ అధికారులు స్పందించి సత్వరమే చర్యలు చేపట్టి రక్షిత మంచినీటిని అందించాలని కోరుతున్నారు.



# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు




**కలెక్టర్ జితేష్ వి పాటిల్**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో రహదారులు ప్రమాదాలు చోటు చేసుకోకుండా సమగ్రమైన రహదారి భద్రత ప్రణాళికలు రూపొందించి రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బుధవారం ఐడిఓసిలో రహదారి భద్రతపై జిల్లా స్థాయి రవాణా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ నిడివి గల జాతీయరహదారులతో పాటు ఆర్అండ్బి, పంచాయితీ రహదారులు ఉన్నాయని, వాటిలో ఎక్కడెక్కడ ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయో గుర్తించాలని ఆదేశించారు. ప్రమాదాలు జరిగిన వెంటనే తక్షణమే చికిత్స నిమిత్తం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తరుపున రూపొందించాలని డిఎంహెచ్ఓను ఆదశించారు. ముందుగా జాతీయ రహదారులు, ఆర్అండ్బి, పంచాయితీ రాజ్, ట్రాన్స్పోర్టు, పోలీస్, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి రహదారి ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న ప్రదేశాలను గుర్తించి పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలన్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన తర్వాత ప్రాణాలు పోకుండా తక్షణమే ఆస్పత్రులకు తీకుకెళ్లేందుకు అవకాశం ఉన్న దగ్గరి రహదారులు, ఆస్పత్రులను ఎంపిక చేయాలన్నారు. అంబులెన్స్, ట్రామా కేంద్రాలపై ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ప్రమాదాలు చోటు చేసుకోకుండా రహదారులపై బోర్డులతో పాటు రేడియం స్టిక్కర్లు, జీబ్రాలైన్లు, స్టాపేజీలు వంటివి ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలో మోటార్ వాహనాల వినియోగం పెరుగుతున్నందున రహదారి ప్రమాదాలు నానాటికీ అధికమవుతున్నాయని, వాహనాలు కండీషన్లో లేకపోవడం, అతివేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం, ట్రాఫిక్ సిగ్నల్ పాటించకపోవడం వల్ల ప్రమాదాలు అధికమవుతున్నాయని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేసి జైలు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో రహదార్లపై ప్రమాదమైన మలుపులులో ఉన్న చెట్లను తొలగించాలని, విద్యుత్ లైను తొలగించేలా చూడాలన్నారు. ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి భాస్కర్ నాయక్, జిల్లా రవాణా అధికారి వెంకటరమణ, ఆర్అండ్బి అధికారులు వెంకటేశ్వర రావు, పంచాయితీ రాజ్ ఇఇ శ్రీనివాసరావు, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వరా చారి, పంచాయితీ అధికారి చంద్రమౌళి, డిసిహెచ్ఎస్ రవిబాబు, పాల్వంచ మున్సిపల్ కమీషనర్ సుజాత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# క్రికెట్ బెట్టింగ్లపై పోలీస్ నిఘా



**- అంతా బాధ్యతగా విధులు నిర్వహించాలి**
**- ఎస్పి రోహిత్ రాజ్**

**ప్రజాపక్షం/భద్రాచలం :** క్రికెట్ బెట్టింగ్లు, గంజాయిఅక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై గట్టి నిఘా పెట్టాలని ఎస్పి రోహిత్ రాజ్ అన్నారు. బుధవారం కొత్తగూడెంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ కాన్ఫిరెన్స్ హాల్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ సమస్యలతో పోలీస్స్టేషన్కు వచ్చే వారికి న్యాయం చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. సమగ్ర విచారణ చేపట్టి నేరస్తులకు శిక్షపడేలా చూడాలన్నారు. పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ వాహనాలు నిత్యం రోడ్లపై సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. 100కు ఫోన్ రాగానే సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు అండగా నిలవాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే, అధికారులు సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. రాబోయే వేసవి సెలవులను దృష్టిలో పెట్టుకుని దొంగతనాల నివారణకై ప్రజలను అప్రమత్తం చేస్తూ పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. సామాన్య ప్రజానికానికి ఇబ్బందులు తలెత్తకుండా అనుమానా స్పందగా సంచరించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టాలన్రాను. శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి అలసత్వం వహించరాదని, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలాకు కారణమయ్యే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఉద్యోగ విషయంలో చక్కటి ప్రతిభ కనబరిచిన వారిని ప్రశంసించారు. ఈ సమావేసంలో భద్రాచలం ఏఎస్పి విక్రాంత్ కుమార్ సింగ్, ఇల్లెందు డిఎస్పి చంద్రభాను, కొత్తగూడెం డిఎస్పి రెహమాన్, పాల్వంచ డిఎస్పి సతీష్ కుమార్తో పాటు జిల్లాలోని పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదలకు ప్రతి రూపం గాలం రామకృష్ణ



**ప్రజాపక్షం/మణుగూరుః** సంస్థ ప్రగతి కోసం కష్టించి పని చేయడం క్రమశిక్షణ, పట్టుదల, ఓర్పు, నేర్పు ఉంటే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఓ సి 2 బేస్ వర్క్ షాప్ లో సీనియర్ మెకానికల్ ఫోర్ మెన్ గా విధులు నిర్వహించే గాలం రామకృష్ణ నిరూపించి ఏరియాలో ఉన్న కార్మికులందరికి స్పూర్తి దాయకంగా నిలిచారని ఏరియా టిబిజికెయస్ వైస్ ప్రసిడెంట్ నాగెల్లి వేంకటేశ్వర్లు తెలిపారు. బేస్ వర్క్ షాప్ లో సీనియర్ మెకానికల్ ఫోర్ మెన్ గా విధులు కొనసాగిస్తూనే సంస్థ అందించే అవకాశాలను సద్వినియోగం చేసుకుని విధుల పట్ల అంకితభావం చిత్త శుద్ధి ప్రదర్శిస్తూ జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ పరీక్షకు హాజరై అత్యంత ప్రతిభ కనబరచి నేడు మణుగూరు ఏరియా లో జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ కు ఎంపిక కావడం హర్షించదగ్గ విషయం అని తెలిపారు. పదోన్నతి వచ్చిన సందర్భంగా బుధవారం ఆయన తోటి ఉద్యోగులందరికీ బోజనాలు ఏర్పాటు చేసి సంతోషం వ్యక్త పరిచారు. జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ గా పదోన్నతి సాధించిన సందర్భంగా ఏరియా టిబిజికెయస్ నాయకులు శాలువ కప్పి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి ఉద్యోగం ద్వారా అర్ధిక క్రమశిక్షణ పాటిస్తూ పట్టుదలతో వారి పిల్లలను కూడా ఉన్నత స్థాయిలో తీర్చిదిద్దే తీరు ఏరియా కార్మికులకు మార్గదర్శకంగా నిలుస్తుందని ఆయన కుమారుడు, కుమార్తె ఇద్దరు కూడా ఇటీవల విడుదలైన ఐఐటి ఫలితాల్లో 98 శాతం మార్కులతో అత్యంత అద్భుతమైన ప్రతిభ కనబరచి దేశంలోనే ఉన్నత ప్రమాణాలు కలిగిన కళాశాలకు ఎంపిక కావడం కూడా గొప్ప విషయం అని ఇలాంటి ఉన్నత లక్ష్యాలు కలిగిన ఉద్యోగులు సంస్థ నందు పని చేయడం ఇతర కార్మికులకు మార్గదర్శకం అని ఆయన సంస్థకు అందించే సేవలు వారంత కొనియాడారు. ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు శుభాకాంక్షలు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇబ్రాయిల్, బంగారి పవన్ కుమార్, రామచారి, పీక నాగరాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# 19న జిపిఓల విధి విధానాలపై సెమినార్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** గ్రామ పాలన ఆఫీసర్స్ (జిపిఓ) విధి విధానాలపై ఈనెల 19న ఖమ్మంలో సెమినార్ నిర్వహించనున్నట్లు గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గరికె ఉపేంద్రరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ వ్యవస్థకు కొత్త రూపం ఇస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకు వచ్చిన భూ భారతి చట్టంలోని అంశాలను భూ భారతి చట్టం నిర్వహణలో గ్రామస్థాయి ఆఫీసర్లుగా ఉండే జిపిఓలకు అవగాహన కల్పించేందుకు ఈ సెమినార్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సెమినార్లో రెవెన్యూ శాఖకు సంబంధించిన ప్రముఖులు హాజరై భూ భారతి చట్టంపై, విధి విధానాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని జిపిఓలుగా రావడానికి ఆప్షన్ ఇచ్చిన విఆర్ఓలు, విఆర్ఏలు ఈ కార్యక్రమంలో పాల్గొని అవగాహన పొందాలన్నారు. భూ భారతి ఆర్వోఆర్ చట్టంపై అవగాహన, విఆర్ఓల విధులు, బాధ్యతలపై అవగాహన, విలువలు మనం పాటించాల్సిన పద్దతులు, మానవ సంబంధాలు, పని (విధులు), ఉద్యోగులు, సర్వీస్ రూల్స్, హక్కులపై ఈ సెమినార్లో అవగాహన కల్పించనున్నట్లు గరికె ఉపేంద్రరావు తెలిపారు.

# రాజులదేవరపాడులో మా ఇంటి మణిదీపం



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ఖమ్మం జిల్లా కలెక్టర్ ప్రవేశపెట్టిన మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని రాజులదేవరపాడు గ్రామంలో దద్దుకూరు అనీల్, జ్యోతిల కుమార్తె భవ్యశ్రీకి 21వరోజు ఉయ్యాల వేసే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి మా ఇంటి మణిదీపం ప్రశంసాపత్రాన్ని అందచేశారు. అనంతరం తాతయ్య, నాయనమ్మలకు శాలువాలతో సత్కరించి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. పోషణ పక్షంలో భాగంగా చిరుధాన్యాలు, పోషకాహారాలపై గర్భిణీలు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్పెషలాఫీసర్ అబ్దుల్ అలీం, ఎంపిడిఓ సురేంద్ర, పిఎస్ వైద్యులు డాక్టర్ ప్రశాంత్, ఎసిడిపిఓ కృష్ణశ్రీ, సూపర్ వైజర్లు, అంగన్వాడీ టీచర్స్, ఆశావర్కర్లు, గ్రామదీపికలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలను మార్కెట్ సరుకుగా చేస్తున్న ప్రభుత్వాలు



**ప్రజాపక్షం/ములకలపల్లి:** మే 7 నుండి మే 31 వరకు హైదరాబాద్లో జరిగే 72వ ప్రపంచ అందాల పోటీలను రద్దు చేయాలని పిఓడబ్ల్యూ పాల్వంచ డివిజన్ కార్యదర్శి టీ దుర్గ, పివైఎల్ జిల్లా కార్యదర్శి కొర్సా రామకృష్ణ డిమాండ్ చేశారు. ప్రగతి శీల మహిళా సంఘం, ప్రగతి శీల యువజన సంఘం ఆధ్వర్యంలో వచ్చే నెల 7 నుండి 30వ తారీఖు వరకు జరిగే అందాల పోటీలను రద్దు చేయాలని రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం నాడు ములకలపల్లి మండల తహసీల్దార్ జి పుల్లారావుకి అందాల పోటీలను రద్దు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో పిఓడబ్ల్యూ జిల్లా నాయకురాలు కల్లూరి పద్మ, పివైఎల్ డివిజన్ నాయకులు పద్దం లక్ష్మణరావు, ఓరుగంటి శ్రీను, కురసం ముకేష్, మండల నాయకులు ఈసం శివ, వెలకం వెంకటేష్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్తో పాడి గేదె, గొర్రెల మృతి



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో మామిడి తోట వద్ద బుధవారం ఉదయం 11 గంటల సమయంలో మేతకు వెళ్లిన పాడి గేదెలలో ఒకటి అకాల వర్షానికి నేలకు వంగిన విద్యుత్ తీగలు తాకడంతో పాడి గేదె అక్కడికక్కడే మృతి చెందింది. గొర్రెలు మహబూబ్నగర్ కు వారికి చెందిన ఐదు గొర్రెలు అక్కడి కక్కడే మృతి చెందినట్లు బుధవారం రైతు ఏలూరి వెంకట రామయ్య తెలిపారు. రైతు కల్లూరు లోని పోలీస్ స్టేషన్లో, పశువైద్యాధికారి మమతకు, తహశీల్దార్ కు, విద్యుత్ శాఖ అధికారికి సమాచారం అందించారు. పాడి గేద విలువ రూ. 70,000 ఉంటుందని రైతు తెలిపారు.

# నిరుపయోగంగా కంపోస్టు షెడ్లు..!

-పంచాయతీల్లో సేంద్రియం కనుమరుగు
-చెత్తను ఒకే చోట చేర్చి నిప్పు
-సీసాలు, ప్లాస్టిక్ వస్తువులను వేరు చేయని సిబ్బంది
-పట్టించుకోని అధికారులు
-ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** గ్రామ పంచాయతీల్లో చెత్త నిర్వహణ అస్తవ్యస్థంగా మారింది. రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన కంపోస్టు షెడ్లు నిరుపయోగంగా తయారయ్యాయి. గత ప్రభుత్వం పరిసరాల పరిశుభ్రతను పాటించాలని, ఎక్కడపడితే అక్కడ చెత్త వేయొద్దనే ఉద్దేశంతో నేలకొండపల్లి మండలంలోని 32 గ్రామ పంచాయతీల్లో పంచాయతీకి ఒకటి చొప్పున 32 నిర్మించారు. నిర్మించిన షెడ్లల్లో తడి, పొడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువుల తయారు చేసుకోవాలని నిబంధన తీసుకొచ్చారు. దీంతో అక్కడ తయారు చేసే సేంద్రియ ఎరువును విక్రయించడం వల్ల పంచాయతీలకు ఆదాయం సమకూరుతాయని భావించింది. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడంలేదు. ప్రారంభంలో అధికారులు హడావిడి చేసి చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం ఆవైపు ఎవరూ కన్నెత్తి చూడటం లేదు. పట్టించుకునే వారు కరువయ్యారు.

### ప్రభుత్వ ధనం వృథా...

పంచాయతీల్లో గత ప్రభుత్వం పల్లెప్రగతి ట్రాక్టర్లు కొనుగోలు చేసింది. తడి, పొడి చెత్త సేకరణకు ఇంటింటికీ చెత్త బుట్టలు పంపిణీ చేశారు. సేకరించిన చెత్తను పారిశుధ్య కార్మికులు కంపోస్టు షెడ్డుకు తరలించాలి. వాటిని పంచాయతీ సిబ్బంది ప్లాస్టిక్, గాజు, ఇనుము, రబ్బరు తదితర వస్తువలను వేరు చేసి ఆయా షెడ్లలోని అరల్లో నిల్వచేయాలి. ప్రస్తుతం అటువంటి పనులేవీ ఇక్కడ నిర్వహించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సేకరించిన చెత్తను ట్రాక్టర్లలో తరలించి ఒక చోట చేర్చి నిప్పు పెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో పంచాయతీలకు ట్రాక్టర్ ఏర్పాటు చేయడం వల్ల ఎటువంటి ఉపయోగం జరగడం లేదని,




ట్రాక్టర్ల ఏర్పాటుతో ప్రభుత్వ ధనం వృథా అవుతుందని స్థానికులు వాపోతున్నారు.

### కొరవడిన అధికారుల పర్యవేక్షణ...

తడి, పొడి చెత్తను వేరు చేసి షెడ్లలో వేస్తే ఎరువుగా మార్చడానికి ఎక్కువ సమయం పడుతుంది. వాన పాములతో సేంద్రియ ఎరువును 4060 రోజుల్లో తయారు చేయొచ్చు. ప్రస్తుతం తడి, పొడి చెత్తను వేరు చేయడం లేదు. వానపాములు లేవు. ఎరువుల తయారీ ఊసేలేదు. నిత్యం పంచాయతీ కార్మికులు చెత్తను ట్రాక్టర్ లో తీసుకెళ్లి ఎక్కడో ఒక చోట పార బోసి తగులబెడుతున్నారు. దాంతో కంపోస్టుషెడ్ల ఉపయోగం తగ్గింది. లక్షలు ఖర్చు చేసి నిర్మించిన కంపోస్టుషెడ్లు ప్రస్తుతం అలంకారప్రాయంగా మారాయి. ఈ విషయంలో ప్రత్యేకాధికారులు, పం చాయతీ కార్యదర్శులు ఆవైపుగా కన్నెత్తి చూడటం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


# సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత

-17 నుంచి ప్రత్యేక నమోదు శిబిరాలు
-లేబర్ కమిషనర్ విజయ్‌భాస్కర్‌రెడ్డి

**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత ప్రభుత్వ కార్మిక, ఉపాధి మంత్రితత్వ శాఖ ఆధ్వర్యంలో సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేసే గిగ్, ప్లాట్‌ఫాం కార్మికులను కలుపుకుని సామాజిక భద్రత ప్రయోజనాలను విస్తరించనున్నట్లు జిల్లా ఉప కార్మిక కమిషనర్ కె. విజయ్‌భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ఇశ్రామ్ పోర్టల్‌ను సమర్ధవంతంగా అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థలో గిగ్, ప్లాట్‌ఫాం కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2025 2026 సంవత్సరాలకు సంబంధించి ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి యోజన, ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజనను విస్తరించనున్నట్లు ఆయన తెలిపారు. కార్మికులు ఎదుర్కొంటున్న సామాజిక భద్రత, ఆరోగ్య సంరక్షణ లోపాలను గుర్తించి పరిష్కరించేందుకు ఇశ్రామ్ పోర్టల్‌లో కార్మికులను నమోదు చేసుకుని గుర్తింపుకార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు.ఈ ప్రక్రియను వేగవంతం చేయడం కోసం జిల్లా, నగర స్థాయిలో ప్రత్యేక శిబిరాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అందుకు ప్రచారాన్ని కూడా చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఏప్రిల్ 17 నుంచి 20 వరకు ప్రత్యేక నమోదు శిబిరాలు ఏర్పాటు చేయబడతాయని విజయ్‌భాస్కర్‌రెడ్డి తెలిపారు. గిగ్, ఫ్లాట్‌పాం కార్మికులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

# ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

-ఇద్దరు మావోయిస్టులు మృతి
-మృతులపై రూ.13 లక్షల రివార్డులు



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో బుధవారం తెల్లవారు ఝామున చోటు చేసుకున్న ఎదురు కాల్పుల్లో ఇద్దరు కీలక మావోయిస్టులు మృతి చెందారు. వివరాల ప్రకారం, ఆ రాష్ట్రంలోని కొండాగావ్ నారాయణపూర్ జిల్లా సరిహద్దున మావోయిస్టులు సంచరిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు భద్రత బాలగాలు అడవిని చుట్టుముట్టాయి. ఈ క్రమంలో కిలాం బుర్గాం అటవీ ప్రాతంలో మావోయిస్టులు తారసపడటంతో లొంగిపోవాలంటూ బలగాలు హెచ్చరికలు జారీ చేశారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య అదే ప్రాంతంలో నాలుగు గంటల పాటు ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఎదురు కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. మృతి చెందిన ఇద్దరు మావోయిస్టులు ప్రభుత్వానికి మోస్ట్ వాంటెడ్ మావోయిస్టులు హల్దార్, రేంలాల ఉన్నారు. వీరిలో ఒకరిపై రూ.8 లక్షలు, మరొకరిపై రూ.5 లక్షల రివార్డు ఉంది. సంఘటన స్థలం నుండి మృతదేహాలతో పాటు ఏకే 47, పేలుడు పదార్థాలు, మందుగుండు సామాగ్రిని పోలీసు బలగాలు స్వాదీనం చేసుకున్నాయి. ఇంకా అడవుల్లో పెద్ద ఎత్తున కూంబింగ్ కొనసాగుతోంది. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా కొనసాగుతున్న వేటలో పోలీసులు గత కొంత కాలంగా పై చేయి సాధిస్తున్నారు. 2026 మార్చి 31 నాటికి దేశాన్ని మావోయిస్టు రహిత దేశంగా మారుస్తామని కేంద్ర హోమ్ మంత్రి అమీత్ షా చెప్పినట్లుగా ఏరివేత వేట ముమ్మరం కావడంతో పాటు మావోయిల్టు స్థావరాలపై నిఘా పెరిగింది. మరో ప్రక్క శాంతి చర్చలకు తాము సిద్ధమే అంటూ షరతులతో కూడిన లేఖను మావోయిస్టు శాంతి చర్చల కమిటీ పంపినప్పటికీ ఆ షరత్తులను కేంద్రం సూచనా ప్రాయంగా తిప్పికొట్టిన విషయం విధితమే. ఆయుధాలను వీడి అరణ్యంలో నుండి బయటకు వస్తే తప్ప చర్చలు అర్థవంతం అవుతాయని, సాయుధులుగా ఉంటూ చర్చలంటే ఎలా అంటూ కేంద్రం చెప్పకనే చెప్పింది. వందలాది మంది సాయుధ మావోయిస్టులు నేలరాలుతున్న వేళ ఇటు చర్చలకు తావిస్తారా, లేకా యుద్దోన్మకులుగానే ముందుకు సాగుతారని అనే విషయం అంతుపట్టకుండా ఉంది.

# దోషులను శిక్షించాలి

**ప్రజాపరక్షం/భద్రాచలం :** విధి నిర్వహణలో ఉన్న అధికారులపై చేయి చేసుకున్న వారిని కఠినంగా శిక్షించాలంటూ భద్రాచలం ప్రజలు ముక్తకంఠంతో అంటున్నారు. మంగళవారం రాత్రి కొర్రాజులగుట్ట సమీపంలో డ్రైనేజీని ఆక్రమించిన నిర్మాణాలను తొలగించే క్రమంలో గ్రామ పంచాయితీ ఇఓ అక్కడికి చేరుకోగా ఆక్రమణ దారులు ఇఓ శ్రీనివాస్‌పై దాడికి పాల్పడి జేసిబి అద్దాలు సైతం ధ్వసం చేశారు.దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. అక్రమ నిర్మాణాల వల్ల రోడ్లపై నీరు చేరి తీవ్ర ఇబ్బందులు తలెత్తడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలకు మేలు చేసేందుకు ఉద్యోగులు చిత్తశుద్ధితో పనిచేస్తుంటే ఇలాంటి దాడులకు పూనుకోవడం అమానుషం. ఈ దాడికి పాల్పడిన వారిని, దాని వెనుకుండి ప్రోత్సహించిన వారిని వెంటనే శిక్షించాలని కోరుతున్నారు. కాగా ఈ విషయంపై కేసు నమోదు చేసిన పోలీసులు పారారీలో ఉన్న దోషుల కోసం గాలిస్తున్నారు.

# కులం పేరుతో దూషిస్తున్నారు..

### - గిరిజన బాలిక సెల్ఫీ వీడియో కలకలం

**ప్రజాపక్షం/భద్రాచలం :** దుమ్ముగూడెం మండలం రామచంద్రునిపేట ఆశ్రమపాఠశాల్లో లంబాడీ టీచర్లు కోయ విద్యార్థిల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తూ కులం పేరుతో దూషిస్తున్నారని ఓ విద్యార్థిని సెల్ఫీ వీడియో కలకలం రేపుతోంది. ఆశ్రమ పాఠశాల్లో పనిచేస్తున్న లంబాడ తెగకు చెందిన హెచ్ఎం కులాధిపత్యంతో వ్యవహిరిస్తున్నారని తమను ఇష్టాను సారంగా తిడుతూ దొంగ సంతకాలు తీసుకుంటున్నారని, సంతకాలు ఎందుకని అడిగితే ఇష్టాను సారంగా మాట్లాతున్నారని ఆ వీడియో బాలికి స్పష్టం చెప్పింది. తమకు కోయ తెగకు చెందిన టీచర్లే కావాలని,లంబాడా తెగకు చెందిన వారితో తమకు ఇబ్బందులు ఉన్నాయని, ఏ చిన్న సమస్య వచ్చినా వారి తెగవారినే ప్రోత్సహించుకుంటూ అకారణంగా దూషిస్తున్నారని కంటతడి పెట్టింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోని తగిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరింది.

# సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/చింతకాని :** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సిఫార్సు మేరకు మండల పరిధిలోని చింతకాని గ్రామానికి చెందిన తలారిలక్ష్మినారాయణ కు రూ.42,500/ ,వడ్డెబోయిన నాగమణికి రూ.22,500/ , గడ్డం నాగమ్మ కు రూ.30,000/ విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు అందజేశారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నిరుపేదల ఆరోగ్యానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తుందిని అన్నారు.తమకు చెక్కులు మంజూరీకి కృషిచేసిన ఉపముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క కు లబ్దిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మార్కెట్ కమిటీ మాజా వైస్ చైర్మన్ మదుపల్లి భాస్కర్, ఆత్మకమిటీ డైరక్టర్లు తోటకూరి ప్రగతి, సట్టు వెంకటేశ్వర్లు , నాయకులు బందెల నాగార్జున. మజీద్, వనం చిన్నప్ప , పాషా , నారపోగు కొండలరావు, ఆళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సన్నబియ్యం పేదలకు వరం



**ప్రజాపక్షం/చింతకాని :** రాష్ట్ర ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తున్న సన్నబియ్యం వరమని చింతకాని తహసీల్దార్ కూరపాటి అనంతరాజు అన్నారు. బుధవారం చింతకాని మండల కేంద్రంలోని తూము భిక్షం నివాసంలో సన్నబియ్యంతో భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సన్నబియ్యం రీసైక్లింగ్ చేయకుండా ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చుంచు శ్రీనివాసరావు, ఎస్సై నాగుల్‌మీరా, మండల అధికారులు , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు, జిల్లా కాంగ్రెస్ నాయకులు మదుపల్లి భాస్కర్, ఆత్మ కమిటీ డైరక్టర్లు తోటకూరి ప్రగతి, సట్టు వెంకటేశ్వర్లు, నాయకలు మజీద్, ఖాసీం, పాషా, చాట్ల చంద్ర, ఆళ్ల శ్రీను, ఎస్‌కె అబ్దుల్, నారపోగు కొండలరావు తదితరులు పాల్గొన్నారు.